పక్కా తెలుగు

ప్రభాత
# కిరణమ్
సత్యానికి వారధి

PRGI REGD No.: TGTEL/26/A4986

5 DOTS NETWORK

అమరావతి | సంపుటి : 01 | సంచిక : 011 | ఆదివారం | 05-07-2026 | పేజీలు : 08 | వెల: రూ.4/- www.prabhathakiranam.com

Amaravathi | Volume : 01 | Issue : 011 | Sunday | 05-07-2026 | Pages: 08 | Price : Rs.4/- Circulated to Telangana | Published from Medchal Malkajgiri




## ప్రాణాలతో చెలగాటం..!

◆ ప్రేమకు హద్దు ఎక్కడ? నమ్మకమే బంధాల పునాది
◆ ప్రేమ మారిందా... మనుషులే మారారా?

ఒకప్పుడు ప్రేమ అంటే జీవితాంతం నిలిచే అనుబంధంగా భావించేవారు. వివాహం అంటే ఇద్దరు వ్యక్తుల కలయిక మాత్రమే కాదు, రెండు కుటుంబాల మధ్య ఏర్పడే విశ్వాస బంధంగా చూసేవారు. మాటకు విలువ ఉండేది. ఇచ్చిన హామీకి గౌరవం ఉండేది. మనసులు కలిసిన తర్వాతే జీవితాన్ని కలిసి నడవాలని పెద్దలు చెప్పేవారు. కాలం మారింది. జీవనశైలి మారింది. సాంకేతికత మనిషి జీవితాన్ని వేగవంతం చేసింది. ప్రపంచం అరచేతిలోకి వచ్చింది. కానీ ఈ మార్పుల మధ్య కొన్ని విలువలు నెమ్మదిగా బలహీనపడిపోయాయ్. నిజాయితీ, నమ్మకం, బాధ్యత, పరస్పర గౌరవం... తగ్గి బంధాలు బలహీనపడ్డాయ్. ఈ పరిస్థితి కేవలం ఒక్క కుటుంబానికి పరిమితం కాదు. సమాజం మొత్తం ఆలోచించాల్సిన అంశంగా మారింది.

## పెట్రో కంపెనీలకు నష్టాలు

◆ 75 వేల కోట్ల నష్టాన్ని భరించాయ్
◆ యుద్ధ సంక్షోభాన్ని తట్టుకున్నాం
◆ ఇంధన భద్రతపై మోదీ వ్యాఖ్యలు




## ఆస్ట్రేలియా పర్యటన మోదీకి బెదిరింపులు

భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆస్ట్రేలియా పర్యటనకు ముందు సోషల్ మీడియాలో బెదిరింపులు రావడం కలకలం రేపింది. మెల్‌బోర్న్‌లో జరగనున్న "మీట్స్ మోదీ" కార్యక్రమానికి సంబంధించిన ఫేస్‌బుక్ పోస్టుపై అబూ ముస్తాఫా పేరుతో ఉన్న ఖాతా నుంచి హెచ్చరిక వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించి పోస్టు చేసిన ఐపీ అడ్రస్‌ను గుర్తించారు. నిందితుల అరెస్టుపై ఇంకా స్పష్టత రాలేదు. జూలై 8 నుంచి 10 వరకు మోదీ ఆస్ట్రేలియాలో పర్యటించనుండగా, జూలై 9న మెల్‌బోర్న్‌లో జరిగే "మీట్స్ మోదీ" కార్యక్రమంలో పాల్గొననున్నారు.

# పేద రైతులకు భూ హక్కులు

వివరాలు2లో..



## నెట్‌జీరోకు కుప్పం దారి

### పర్యావరణానికి సీఎం ప్రాధాన్యం

### రాష్ట్రానికి ఆదర్శంగా నలగంపల్లి విధానం

కుప్పం పర్యటన రెండో రోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నలగంపల్లి గ్రామాన్ని సందర్శించి నెట్ జీరో విధానాన్ని పరిశీలించారు. గ్రామంలో అమలవుతున్న పర్యావరణహిత కార్యక్రమాలను రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. సోలార్ రూఫ్‌టాప్‌లు, ఇండక్షన్ కుక్‌టాప్‌లు, వర్షపు నీటి సంరక్షణ, కిచెన్ కంపోస్టింగ్, టెర్రస్ గార్డెనింగ్ వంటి విధానాలను పరిశీలించిన సీఎం, ఈ నమూనాను కేస్ స్టడీగా తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే అవకాశాలను అధ్యయనం చేయాలని ఆదేశించారు. (వివరాలు 2లో..)

◆ ఆరు దశాబ్దాల నిరీక్షణ ముగింపు
◆ 61 ఏళ్ల కంగుంది భూ సమస్యకు ముగింపు
◆ 322 కుటుంబాలకు పట్టాలకు సీఎం పట్టాలు

ఆరు దశాబ్దాలుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న కంగుంది గ్రామ భూ సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. కుప్పం నియోజకవర్గంలోని కంగుందిలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 460.19 ఎకరాల భూమికి సంబంధించిన డీకేటీ పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. పట్టాల పంపిణీకి సంబంధించిన శిలాఫలకాన్ని కూడా ఆవిష్కరించారు. 61 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యను భూ రికార్డులను సమగ్రంగా పరిశీలించి, అన్ని కోణాల్లో అధ్యయనం చేసి పరిష్కరించినట్లు సీఎం తెలిపారు. అడవి పొరంబోకు భూమిని అసైన్డ్ వేస్ట్ డ్రై భూమిగా మార్చేందుకు కేబినెట్ ఆమోదం తీసుకుని రైతులకు హక్కులు కల్పించినట్లు వెల్లడించారు.

## యువనేత పెట్టుబడుల వేట

»మంత్రి లోకేశ్‌కు దక్షిణ కొరియా ఆహ్వానం!
»ఈ నెల 5 నుంచి 11 వరకు పర్యటన


భారత్-దక్షిణ కొరియా ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం లక్ష్యంగా ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు రిపబ్లిక్ ఆఫ్ కొరియా అధికారిక ఆహ్వానం అందింది. ఆహ్వానం మేరకు ఈ నెల 5 నుంచి 11 వరకు మంత్రి లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో అధికారిక సమావేశాలతో పాటు పెట్టుబడుల ఆకర్షణపై ప్రత్యేక దృష్టిసారించనున్నారు. దక్షిణ కొరియా కాన్సులేట్ జనరల్ (చెన్నై) చాంగ్ న్యూన్ కిమ్ ఆహ్వాన లేఖలో ఈ పర్యటన ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసే కీలక అడుగుగా నిలుస్తుందని పేర్కొన్నారు. కొరియా ప్రభుత్వ ప్రతినిధులతో జరిగే సమావేశాల్లో ద్వైపాక్షిక సంబంధాలు, సాంకేతిక సహకారం, పెట్టుబడుల విస్తరణపై చర్చలు జరగనున్నాయి. (వివరాలు 2లో..)




## సంజీవని డేటా ఇంటిగ్రేషన్‌కే పెద్దపీట

### సీటీ స్కాన్, డయాలసిస్ సేవల ప్రారంభం

సంజీవని కార్యక్రమం విజయవంతం కావాలంటే డేటా ఇంటిగ్రేషన్ అత్యంత కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కుప్పం పర్యటన రెండో రోజు వైద్యారోగ్య శాఖ అధికారులతో సమావేశమైన సీఎం, హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్‌తో పాటు అన్ని సేవలను పరస్పరం అనుసంధానం చేయాలని ఆదేశించారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రజలకు ఎంత మేర ప్రయోజనం కలిగిందో పూర్తి వివరాలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రజలు సేవలపై సంతృప్తి చెందేలా వ్యవస్థ పనిచేయాలని అధికారులకు చెప్పారు. (వివరాలు 2లో..)






## ఖమేనీకి తుది వీడ్కోలు

◆ టెహ్రాన్‌లో లక్షలాది మందితో అంతిమ యాత్ర
◆ భారీగా తరలివచ్చిన దేశాధినేతలు, ప్రజలు




## 50 మంది బంగ్లాదేశీయుల బహిష్కరణ

పశ్చిమ బెంగాల్‌కు తరలింపు




## ఉల్లి రైతులకు కేంద్రం శుభవార్త

కనీస మద్దతు ధర 13% పెంపు

## ప్రశ్న - జవాబు

ప్రశ్న రావణ్ అరెస్ట్ పై అటు అధికార,విపక్షాల మధ్య మాటల మంటలు రేగాయి. ఓవైపు మంత్రి కందుల దుర్గేశ్ ప్రకాశ్‌రాజ్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తూ ప్రభుత్వ వైఖరిని సమర్థించగా, మరోవైపు విపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించే వారిపై వేధింపులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇద్దరు నేతల వ్యాఖ్యలతో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.

## ప్రశ్నిస్తే వేధింపులా?..

### ప్రభుత్వంపై బొత్స తీవ్ర విమర్శలు

యూట్యూబ్ జర్నలిస్టుల అరెస్టులు ప్రభుత్వ కక్షసాధింపు రాజకీయాలకు నిదర్శనమని ఆరోపించారు శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే వారిని వేధించడం సరికాదన్నారు. వ్యక్తిగత దూషణలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని, భావప్రకటన స్వేచ్ఛను అణచివేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రజా



సమస్యలను పక్కనపెట్టి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపులకే ప్రాధాన్యం ఇస్తోందని బొత్స మండిపడ్డారు. (వివరాలు 2లో..)

## ప్రకాశ్‌రాజ్‌పై మంత్రి దుర్గేశ్ తీవ్ర విమర్శలు

### జోసెఫ్, ప్రకాశ్ రాజ్‌ల మధ్య అక్రమ సంబంధం




సినీనటుడు ప్రకాశ్‌రాజ్, యూట్యూబర్ రావణ్ మధ్య అపవిత్ర సంబంధం ఉందంటూ మంత్రి కందుల దుర్గేశ్ తీవ్ర ఆరోపణలు చేశారు. సోషల్ మీడియాలో ప్రకాశ్‌రాజ్ చేసే వ్యాఖ్యలు జోసెఫ్ సూచనల మేరకేనని అన్నారు. వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధానికి సంబంధించి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. గతంలో బయటకు వచ్చిన ఆడియో కాల్ కూడా దీనికి ఉదాహరణగా నిలుస్తుందని చెప్పారు.


# అంతా సీఐ నాగరాజే చేశాడు

◆ కాళ్లపై మేకులతో కొట్టి చంపాడు
◆ మెజిస్టీరియల్ విచారణలో భావోద్వేగం
◆ హాజరైన సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి

గాదె సాయికృష్ణ మృతి కేసులో మెజిస్టీరియల్ విచారణ కొనసాగుతోంది. విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన విచారణకు సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి, మేనమామ నాగేశ్వరరావు, మేనత్త హాజరై తమ వాంగ్మూలాలను నమోదు చేశారు. దాదాపు రెండు గంటల పాటు విచారణ కొనసాగింది. ఈ సందర్భంగా విజయలక్ష్మి పోలీసులపై తీవ్ర ఆరోపణలు చేశారు. తన కుమారుడిని పోలీసులే హత్య చేసి, అనంతరం మృతదేహాన్ని మాయం చేశారని ఆరోపించారు. కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో సాయికృష్ణ ఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లామని, అప్పటి సీఐ నాగరాజు తన కుమారుడిని చూపకుండా వెనక్కి పంపించారని తెలిపారు.

**హింసించి చంపేశారు**

కాళ్లపై మేకులు కొట్టి తీవ్రంగా హింసించి చంపారని కూడా ఆరోపించారు. తన కుమారుడి బూడిదను తమకు అప్పగిస్తే అంత్యక్రియలు నిర్వహిస్తానని, లేకపోతే ఆత్మహత్య చేసుకుంటానని విజయలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుస్టేషన్‌పై ఉన్న బూడిద, ఎముకలు నిజంగా తన కుమారుడివేనన్న నమ్మకం లేదని చెప్పారు. ఈ కేసులో కొందరిని అరెస్టు చేసినా మిగతావారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. పూర్తి నిజాలు వెలుగులోకి రావాలంటే సమగ్ర, నిష్పాక్షిక విచారణ జరగాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఈ కేసులో మెజిస్టీరియల్ విచారణ కీలకంగా మారింది.







## మమతా బెనర్జీకి మరో ఎదురుదెబ్బ

### రాష్ట్ర అధ్యక్ష పదవికి చంద్రిమా రాజీనామా

తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి మరో రాజకీయ ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు చంద్రిమా భట్టాచార్య తన పదవితో పాటు పార్టీలోని అన్ని బాధ్యతలకు రాజీనామా చేశారు. జూన్ మొదటి వారంలో రాష్ట్ర అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన ఆమె నెల రోజుల్లోనే వైదొలగడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటికే పలువురు కీలక నేతలు పార్టీని వీడగా, రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు వర్గం పార్టీ ప్రధాన కార్యాలయాన్ని స్వాధీనం చేసుకుని తమదే అసలైన టీఎంసీ అని ప్రకటించింది. ఈ పరిణామాలు మమతా బెనర్జీకి వరుస ఎదురుదెబ్బలుగా మారాయి.

3లో.. **చచ్చేదాక పోరాడతా**

తిరుగుబాటుదారులకు దీదీ సవాల్

## విద్యా వ్యవస్థ ప్రక్షాళనకు బొద్దింకల పార్టీ దూకుడు

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు పోరాటం

### వెనక్కి తగ్గబోమంటున్న కాక్రోచ్ పార్టీ కార్యకర్తలు

### విషమించిన సోనం వాంగ్‌చుక్ ఆరోగ్యంపై ఆందోళన

### 15 రోజులుగా జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న దీక్ష

న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో కొనసాగుతున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలోని నిరసన 15వ రోజుకు చేరుకుంది. పలు పరీక్షల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కొనసాగుతోంది. (వివరాలు 2లో..)



# యువనేత పెట్టుబడుల వేట



- మంత్రి లోకేశ్‌కు దక్షిణ కొరియా ఆహ్వానం!
- ఈ నెల 5 నుంచి 11 వరకు పర్యటన

భారత్-దక్షిణ కొరియా ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం లక్ష్యంగా ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు రిపబ్లిక్ ఆఫ్ కొరియా అధికారిక ఆహ్వానం అందింది. ఆహ్వానం మేరకు ఈ నెల 5 నుంచి 11 వరకు మంత్రి లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో అధికారిక సమావేశాలతో పాటు పెట్టుబడుల ఆకర్షణపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. దక్షిణ కొరియా కాన్సులేట్ జనరల్ (చెన్నై) చాంగ్ న్యాన్ కిమ్ ఆహ్వాన లేఖలో ఈ పర్యటన ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసే కీలక అడుగుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ద్వైపాక్షిక సంబంధాలు, సాంకేతిక సహకారం, పెట్టుబడుల విస్తరణపై చర్చలు జరగనున్నాయి.

**• స్టార్టప్‌లు, పరిశ్రమలతో కీలక భేటీలు**

జూలై 5న దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో జరిగే ఇండియా డయాస్పోరా సమావేశానికి మంత్రి లోకేశ్ హాజరవుతారు. అక్కడి భారతీయులు, తెలుగు ప్రవాసులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రవాస భారతీయులతో సంబంధాలను మరింత బలోపేతం చేయనున్నారు. జూలై 6న కొరియా టెక్ స్టార్టప్ సంస్థల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం వివిధ సంస్థలతో పెట్టుబడి చర్చలు నిర్వహిస్తారు. హ్యోసంగ్ భారీ పరిశ్రమల సంఘం అధ్యక్షుడు టకేషి యొకోటా, సియోల్ సెమికండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ బేహ్యూంగ్ లీతో ప్రత్యేకంగా సమావేశమై పరిశ్రమల పెట్టుబడులపై చర్చించనున్నారు. జూలై 7న ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ అధ్యక్షుడు యున్ జు కోహ్ ఆధ్వర్యంలో ఎల్జీ టవర్‌లో జరిగే విందు సమావేశంలో పాల్గొంటారు. ఎల్జీ అనుబంధ సంస్థలకు చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధులతో ఏపీలో పెట్టుబడుల అవకాశాలపై చర్చించనున్నారు.

**• సీఐఐ సమ్మిట్‌కు ఆహ్వానం**

జూలై 8న కొరియన్ మెరైన్ ఎక్విప్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమవుతారు. జూలై 9న కొరియన్ పొలిటికల్ అఫైర్స్ డిప్యూటీ మంత్రి యుయుహ్ సినిలియా చుంగ్, కొరియన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ డిప్యూటీ మంత్రి కాంచన్ కాంగ్‌లతో భేటీ కానున్నారు. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడుల విస్తరణపై చర్చలు జరగనున్నాయి. జూలై 10న వివిధ కొరియా కంపెనీల ప్రతినిధులతో పెట్టుబడి సమావేశాల్లో పాల్గొంటారు. కొరియా ఆటో ఇండస్ట్రీ కోఆపరేషన్ ఏజెన్సీ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. అదే రోజు రాత్రి సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్-2026 విజయవంతం కావాలని కోరుతూ కొరియా కంపెనీల ప్రతినిధులతో రోడ్‌షోలో పాల్గొని, ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఆహ్వానం పలకనున్నారు. ఈ పర్యటన ద్వారా ఏపీకి కొత్త పెట్టుబడులు, సాంకేతిక భాగస్వామ్యాలు తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోంది.

# పెట్రో కంపెనీలకు నష్టాలు

- 75 వేల కోట్ల నష్టాన్ని భరించాయ్
- యుద్ధ సంక్షోభాన్ని తట్టుకున్నాం
- ఇంధన భద్రతపై మోదీ వ్యాఖ్యలు

పశ్చిమాసియా యుద్ధం ప్రపంచ ఇంధన రంగాన్ని తీవ్రంగా దెబ్బతీసినా భారత్ సమర్థంగా ఆ సంక్షోభాన్ని ఎదుర్కొందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. రాజస్థాన్‌లోని బాలోత్రా జిల్లా పచ్‌పద్రాలో దేశంలోని తొలి గ్రీన్‌ఫీల్డ్ సమగ్ర రిఫైనరీ-పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సమస్యను ముందుగానే అంచనా వేసి సరైన నిర్ణయాలు తీసుకోవడం వల్ల దేశంలో ఇంధన సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగలేదని చెప్పారు. ప్రజల ప్రయోజనాలే కేంద్ర ప్రభుత్వానికి ప్రధానమని స్పష్టం చేశారు.

**ఇంధనంపై ప్రజలను భయపెట్టే యత్నాలు జరిగాయి**

యుద్ధం సమయంలో దేశంలో ఇంధన కొరత ఏర్పడుతుందని కొందరు ప్రజలను భయపెట్టే ప్రయత్నం చేశారని ప్రధాని విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం జరిగినా అది ఫలించలేదన్నారు. కొన్ని స్వల్ప ఇబ్బందులు మినహా దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ సరఫరా ఎక్కడా నిలిచిపోలేదని పేర్కొన్నారు. ప్రజలపై భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిందని వెల్లడించారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరగడంతో ఏప్రిల్ నుంచి జూన్ మధ్య ప్రభుత్వ చమురు సంస్థలు రూ.75 వేల కోట్లకు పైగా నష్టాన్ని భరించాయని తెలిపారు

**అయితే సమర్థంగా సవాళ్లను అధిగమించగలిగాం**

యుద్ధానికి ముందు భారత్ 25-26 దేశాల నుంచే ఇంధనం దిగుమతి చేసుకునేదని, దౌత్యపరమైన ప్రయత్నాలతో ఆ సంఖ్యను 40కి పైగా దేశాలకు పెంచినట్లు మోదీ వెల్లడించారు. హార్మూజ్ జలసంధి మార్గంలో ఎల్పీజీ సరఫరా దెబ్బతిన్న సమయంలో దేశీయ ఉత్పత్తిని ఏడు రోజుల్లోనే 35 వేల మెట్రిక్ టన్నుల నుంచి 54 వేల మెట్రిక్ టన్నులకు పెంచామని చెప్పారు. ఎల్పీజీ ఉత్పత్తి చేయని కొన్ని రిఫైనరీలను కూడా ఇందుకు అనుగుణంగా మార్చినట్లు వివరించారు. పైప్ ద్వారా సహజ వాయువు కనెక్షన్లను విస్తరించి 11 లక్షలకుపైగా కుటుంబాలకు కొత్త పీఎన్‌జీ కనెక్షన్లు అందించామని తెలిపారు. మార్కెట్ అంచనాల ప్రకారం సిలిండర్ ధర రూ.2 వేల వరకు చేరే అవకాశం ఉన్నా ప్రస్తుతం రూ.950లోపే అందిస్తున్నామని చెప్పారు.

**రాజస్థాన్‌లో గ్రీన్ రిఫైనరీని ప్రారంభించిన ప్రధాని మోదీ**

పచ్‌పద్రాలో ప్రారంభించిన సమగ్ర రిఫైనరీతో భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ దేశంగా మరింత బలోపేతమవుతుందని ప్రధాని అన్నారు. ఏడాదికి 2.4 మిలియన్ మెట్రిక్ టన్నుల పెట్రోకెమికల్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు దేశ ఇంధన భద్రతను పెంచడంతో పాటు పెట్రోకెమికల్ రంగంలో స్వయం సమృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. ఇదే కార్యక్రమంలో రూ.1.06 లక్షల కోట్ల విలువైన రైల్వే, రహదారి, మెట్రో, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ ప్రసార ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. భారత్ ఆత్మనిర్భర దిశగా మరింత వేగంగా ముందుకు సాగుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## విద్యా వ్యవస్థ ప్రక్షాళనకు

# బొద్దింకల పార్టీ దూకుడు

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు పోరాటం
- వెనక్కి తగ్గబోమంటున్న కాక్రోచ్ పార్టీ కార్యకర్తలు
- విషమించిన సోనం వాంగ్‌చుక్ ఆరోగ్యంపై ఆందోళన
- 15 రోజులుగా జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న దీక్ష

న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో కొనసాగుతున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలోని నిరసన 15వ రోజుకు చేరుకుంది. పలు పరీక్షల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కొనసాగుతోంది. ఈ ఉద్యమానికి మద్దతుగా పర్యావరణ కార్యకర్త, విద్యావేత్త సోనం వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష ఏడో రోజుకు చేరుకుంది. రోజురోజుకూ ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తోందని సీజేపీ నాయకులు తెలిపారు.

**• ఆరోగ్యంపై పెరుగుతున్న ఆందోళన**

సోనం వాంగ్‌చుక్ ఇప్పటికే ఐదు కిలోల బరువు కోల్పోయారని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడించారు. ప్రతి రోజు ఆయన ఆరోగ్యం మరింత క్షీణిస్తోందని, అయినప్పటికీ దీక్షను విరమించే ప్రసక్తే లేదని చెప్పారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే ఏదైనా అనర్థం జరిగితే దానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను ఇప్పటికీ పదవి నుంచి ఎందుకు తొలగించడం లేదని ప్రధాని నరేంద్ర మోదీని ఆయన ప్రశ్నించారు.

**• లడఖ్ చర్చలపై వాంగ్‌చుక్ స్పందన**

లడఖ్ సమస్య పరిష్కార దిశగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను సోనం వాంగ్‌చుక్ స్వాగతించారు. లడఖ్ ప్రతినిధులు, కేంద్ర హోంమంత్రిత్వ శాఖ మధ్య చర్చలు ముందుకు సాగడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు. ఇప్పుడు విద్యా రంగంలో జవాబుదారీతనంపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. లడఖ్ అంశంలో ఏర్పడిన ప్రతిష్ఠంభన తొలగడానికి వాంగ్‌చుక్ దీక్ష కూడా ఒక కారణమని లేహ్ అపెక్స్ బాడీ, కార్గిల్ డెమోక్రటిక్ అలయన్స్ నాయకులు అభిప్రాయపడ్డారు.

**• విద్యార్థి సంఘాల మద్దతు**

జంతర్‌మంతర్‌లో మరో వేదికపై అఖిల భారత విద్యార్థి సంఘానికి చెందిన ఆరుగురు విద్యార్థులు కూడా నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. ఈ ఉద్యమానికి పలువురు రాజకీయ నేతలు, సామాజిక కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. నీట్ సహా పలు పరీక్షల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై జూన్ 20న ప్రారంభమైన ఈ ఆందోళన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కేంద్ర ప్రభుత్వం ఈ డిమాండ్లపై ఎలా స్పందిస్తుందనే అంశం ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంది.

# పేద రైతులకు భూ హక్కులు

- ఆరు దశాబ్దాల నిరీక్షణ ముగింపు
- 61 ఏళ్ల కంగుంది భూ సమస్యకు ముగింపు
- 322 కుటుంబాలకు పట్టాలకు సఎం పట్టాలు

ఆరు దశాబ్దాలుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న కంగుంది గ్రామ భూ సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. కుప్పం నియోజకవర్గంలోని కంగుందిలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 460.19 ఎకరాల భూమికి సంబంధించిన డీకేటీ పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. పట్టాల పంపిణీకి సంబంధించిన శిలాఫలకాన్ని కూడా ఆవిష్కరించారు. 61 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యను భూ రికార్డులను సమగ్రంగా పరిశీలించి, అన్ని కోణాల్లో అధ్యయనం చేసి పరిష్కరించినట్లు సీఎం తెలిపారు. అడవి పొరంబోకు భూమిని అసైన్డ్ వేస్ట్ డ్రై భూమిగా మార్చేందుకు కేబినెట్ ఆమోదం తీసుకుని రైతులకు హక్కులు కల్పించినట్లు వెల్లడించారు.

**• 322 మంది పేదలకు పట్టాలు పంపిణీ చేసిన సీఎం**

తరతరాలుగా సాగు చేస్తున్న భూములకు అధికారిక హక్కులు లభించడం ఆనందంగా ఉందని చంద్రబాబు అన్నారు. 322 మంది రైతులకు 460.19 ఎకరాల భూమిని పట్టాల రూపంలో అందించడం ప్రభుత్వానికి సంతోషకరమైన విషయమని చెప్పారు. రైతుల పక్షాన న్యాయం ఉండటంతోనే ఈ సమస్యను పరిష్కరించగలిగామని పేర్కొన్నారు. కంగుంది కోట సాక్షిగా పట్టాలు అందజేయడం చారిత్రాత్మక ఘట్టమన్నారు. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు వంటి ప్రాంతాల్లో కూడా దీర్ఘకాల భూ సమస్యలను పరిష్కరించినట్లు గుర్తుచేశారు.

**• సామాజిక న్యాయంపట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం**

పేదలకు భూ హక్కులు కల్పించడం ప్రభుత్వ సామాజిక న్యాయానికి నిదర్శనమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. భూ వివాదాల పరిష్కారంలో ఓర్పు, సమగ్ర పరిశీలన అవసరమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజల పట్టాదార్ పాస్ పుస్తకాలపై రాజకీయ నాయకుల ఫొటోలు ముద్రించారని విమర్శించారు. వాటి స్థానంలో రాజముద్రతో కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రజల భూములకు పూర్తి భద్రత కల్పించేందుకు సాంకేతికతను వినియోగిస్తున్నామని చెప్పారు.

**• ఏడాది లో రాష్ట్రవ్యాప్తంగా భూ వివాదాలు పరిష్కరిస్తాం**



రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న భూ వివాదాలన్నింటినీ వచ్చే ఏడాదిలోగా పరిష్కరించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని చంద్రబాబు వెల్లడించారు. కుటుంబ ఆస్తి వివాదాలు కూడా అనేక సమస్యలకు కారణమవుతున్నాయని పేర్కొంటూ తల్లిదండ్రులు, సోదరీమణుల హక్కులను గౌరవించాలని సూచించారు. రాష్ట్రంలో రౌడీయిజం, గూండాయిజానికి తావు లేదని స్పష్టం చేశారు. పరిశ్రమలు తీసుకొచ్చి స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు.

**• అభివృద్ధి కోసం యజ్ఞం చేస్తుంటే? రాక్షసుల్లా అడ్డుపడుతున్నారు**

కుప్పాన్ని స్వర్ణ కుప్పం-స్వచ్ఛ కుప్పంగా తీర్చిదిద్దేందుకు నెట్ జీరో విధానాన్ని అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. సోలార్ విద్యుత్ వినియోగం పెంచాలని, ఈ-వాహనాలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. డ్వాక్రా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని, వారి ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించేలా ప్రత్యేక బ్రాండ్‌ను రూపొందించామని చెప్పారు. కుప్పం పొగురుపల్లిలో రూ.9,322 కోట్ల పెట్టుబడులతో 30 అభివృద్ధి ప్రాజెక్టులు చేపడుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్రానికి కోల్పోయిన బ్రాండ్‌ను తిరిగి తీసుకొచ్చామని పేర్కొన్న సీఎం, ప్రభుత్వం అభివృద్ధి యజ్ఞం చేస్తుంటే కొందరు రాక్షసుల్లా అడ్డుపడుతున్నారని విమర్శించారు. ప్రజల సహకారంతో అభివృద్ధిని ఎవరూ ఆపలేరని చంద్రబాబు స్పష్టం చేశారు.

# సంజీవని డేటా ఇంటిగ్రేషన్‌కే పెద్దపీట

### సీటీ స్కాన్, డయాలసిస్ సేవల ప్రారంభం

సంజీవని కార్యక్రమం విజయవంతం కావాలంటే డేటా ఇంటిగ్రేషన్ అత్యంత కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కుప్పం పర్యటన రెండో రోజు వైద్యారోగ్య శాఖ అధికారులతో సమావేశమైన సీఎం, హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్‌తో పాటు అన్ని సేవలను పరస్పరం అనుసంధానం చేయాలని ఆదేశించారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రజలకు ఎంత మేర ప్రయోజనం కలిగిందో పూర్తి వివరాలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రజలు సేవలపై సంతృప్తి చెందేలా వ్యవస్థ పనిచేయాలని అధికారులకు చెప్పారు.

**• కుప్పం ప్రభుత్వ ఆస్పత్రిలో సీటీ స్కాన్, డయాలసిస్ సేవల్ని ప్రారంభించిన సీఎం**

కుప్పం ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన సీటీ స్కాన్, డయాలసిస్ కేంద్రాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. సీటీ స్కాన్ ద్వారా రోజుకు ఎంతమందికి సేవలు అందించగలరని అధికారులను ప్రశ్నించారు. రోజుకు 30 నుంచి 40 మందికి పరీక్షలు నిర్వహించవచ్చని అధికారులు వివరించారు. డయాలసిస్ వార్డును పరిశీలించిన సీఎం, పొరుగు రాష్ట్రాల నుంచి కూడా రోగులు ఇక్కడికి వస్తుండటం సంతోషకరమని అన్నారు. ఆస్పత్రి ఆవరణలో చెత్త కనిపించడంపై అసంతృప్తి వ్యక్తం చేసి వెంటనే పరిశుభ్రత చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**• డ్రగ్స్, గంజాయిపై మరింత కఠినంగా ఉండాలని పోలీసులకు ఆదేశం**

వైద్యారోగ్య రంగానికి సంబంధించిన ప్రదర్శనను పరిశీలించిన సీఎం పలు ఆవిష్కరణలను



అభినందించారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే వైద్యులకు సమాచారం చేరే పరికరాన్ని రూపొందించిన విద్యార్థిని ప్రశంసించారు. బ్రహ్మకుమారీలు డ్రగ్స్, గంజాయి బాధితులకు ధ్యానం ద్వారా పునరావాసం కల్పిస్తున్న విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా గంజాయి, డ్రగ్స్ నియంత్రణలో మరింత కఠినంగా వ్యవహరించాలని పోలీసు ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**• పంచతత్వ కాన్సెప్టుతో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ పరిశీలించిన సీఎం చంద్రబాబు**

పంచతత్వ కాన్సెప్టుతో రూపొందించిన వాకింగ్ ట్రాక్‌ను ముఖ్యమంత్రి పరిశీలించి మొక్క నాటారు. అనంతరం కుప్పం పట్టణంలో ఏర్పాటు చేసిన స్వర్ణ కుప్పం-స్వచ్ఛ కుప్పం స్వాగత ఆర్చ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. కుప్పంలో వైద్య సేవల విస్తరణ, ఆధునిక సదుపాయాల కల్పనతో ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

# నెట్‌జీరోకు కుప్పం దారి

- పర్యావరణానికి సీఎం ప్రాధాన్యం
- రాష్ట్రానికి ఆదర్శంగా నలగంపల్లి విధానం

కుప్పం పర్యటన రెండో రోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నలగంపల్లి గ్రామాన్ని సందర్శించి నెట్ జీరో విధానాన్ని పరిశీలించారు. గ్రామంలో అమలవుతున్న పర్యావరణహిత కార్యక్రమాలను రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. సోలార్ రూఫ్‌టాప్‌లు, ఇండక్షన్ కుక్‌టాప్‌లు, వర్షపు నీటి సంరక్షణ, కిచెన్ కంపోస్టింగ్, టెర్రస్ గార్డెనింగ్ వంటి విధానాలను పరిశీలించిన సీఎం, ఈ నమూనాను కేస్ స్టడీగా తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే అవకాశాలను అధ్యయనం చేయాలని ఆదేశించారు.

**• కుప్పం అంతటా అమలుకు సీఎం ఆదేశం**

నలగంపల్లి అమలు చేస్తున్న విధానాన్ని కుప్పం మొత్తం విస్తరించాలని సీఎం స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో సర్క్యులర్ ఎకానమీని అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నెట్ జీరో విధానంలో భాగంగా విద్యుత్ వినియోగం తగ్గించడం, వ్యర్థాలను సద్వినియోగం చేసుకోవడం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. ఈవీ వాహనాల వినియోగాన్ని కూడా ఈ విధానంలో చేర్చాలని సూచించారు.

**• నెట్‌జీరో విధానాన్ని అమలు చేస్తోన్న ఇళ్లను సీఎం పరిశీలన**

గ్రామంలోని ఓ ఇంటిని సందర్శించిన చంద్రబాబు సోలార్ ప్యానెళ్ల సంఖ్య, విద్యుత్ ఉత్పత్తి, ఇంటి అవసరాలకు సరిపోతుందా అనే అంశాలను తెలుసుకున్నారు. సోలార్ విద్యుత్‌తో ఇండక్షన్ స్టవ్‌లను వినియోగిస్తూ నెలకు సుమారు రూ.400



వరకు ఆదా అవుతోందని లబ్ధిదారులు వివరించారు. వర్షపు నీటి సంరక్షణ, కిచెన్ కంపోస్టింగ్, కిచెన్ గార్డెన్, టెర్రస్ గార్డెన్ నిర్వహణను కూడా సీఎం పరిశీలించారు. ఇండక్షన్ స్టవ్‌లతో అన్ని రకాల వంటలు సులభంగా చేయవచ్చని, గ్యాస్ లీకేజీ ప్రమాదాలు తగ్గి భద్రత పెరుగుతుందని పేర్కొన్నారు.

**• రూఫ్‌టాప్ సోలార్ విస్తరణపై దృష్టి**

కుప్పంలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థ విస్తరణ ద్వారా వేలాది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని అధికారులు సీఎంకు వివరించారు. ఈ విధానాన్ని కుప్పం అంతటా అమలు చేసి ప్రజల విద్యుత్ ఖర్చును తగ్గించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా చర్యలు చేపట్టాలని చంద్రబాబు ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ప్రకాశ్‌రాజ్‌పై మంత్రి దుర్గేశ్ తీవ్ర విమర్శలు

### జోసెఫ్, ప్రకాశ్ రాజ్‌ల మధ్య అక్రమ సంబంధం

సినీనటుడు ప్రకాశ్‌రాజ్, యూట్యూబర్ రావణ్ మధ్య అపవిత్ర సంబంధం ఉందంటూ మంత్రి కందుల దుర్గేశ్ తీవ్ర ఆరోపణలు చేశారు. సోషల్ మీడియాలో ప్రకాశ్‌రాజ్ చేసే వ్యాఖ్యలు జోసెఫ్ సూచనల మేరకేనని అన్నారు. వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధానికి సంబంధించి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. గతంలో బయటకు వచ్చిన ఆడియో కాల్ కూడా దీనికి ఉదాహరణగా నిలుస్తుందని చెప్పారు.

**• సంఘ విద్రోహ శక్తులనడంలో సందేహం లేదు**

ప్రకాశ్‌రాజ్, జోసెఫ్ రాష్ట్రంలో కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి ఆరోపించారు. రాష్ట్రంలో ఘర్షణ వాతావరణం సృష్టించేందుకు కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. ఇలాంటి సంఘ విద్రోహ శక్తులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించడం పేరుతో వ్యక్తిగత దూషణలు చేయడం సరైన విధానం కాదని వ్యాఖ్యానించారు.

**• తాడేపల్లి ప్యాలెస్ కనుసన్నల్లో ప్రకాశ్ రాజ్ ఆస్కింగ్**

ప్రకాశ్‌రాజ్ చేస్తున్న "జస్ట్ ఆస్కింగ్" వ్యాఖ్యల వెనుక తాడేపల్లి ప్యాలెస్ పాత్ర ఉందని మంత్రి ఆరోపించారు. అక్కడి నుంచి వచ్చే సూచనలతోనే ఆయన స్పందిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంతో ప్రత్యక్ష సంబంధం లేకపోయినా ప్రకాశ్‌రాజ్ తరచూ స్పందించడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని అన్నారు. తెర ముందు కనిపించే వ్యక్తుల వెనుక అసలు శక్తులు ఎవరో బయటపడాలని పేర్కొన్నారు.

**• అక్కడి డబ్బుల కోసం ఇద్దరూ రాష్ట్రంలో ఘర్షణలకు యత్నం**

తాడేపల్లి ప్యాలెస్ నుంచి వచ్చే డబ్బు కోసమే ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతున్నారని మంత్రి కందుల దుర్గేశ్ ఆరోపించారు. డబ్బు కోసం రాష్ట్రంలో కుల, మత ఘర్షణలు రెచ్చగొట్టే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ప్రజలు ఇలాంటి కుట్రలను గుర్తించి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వైసీపీ పాలనలో



జరిగిన ఘటనలపై ప్రకాశ్‌రాజ్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఆలయాలపై దాడులు జరిగినప్పుడు ఆయన మౌనం ఎందుకు పాటించారని నిలదీశారు.

**• డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ లక్ష్యంగా ప్రకాశ్ రాజ్ చర్యలు**

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని ప్రకాశ్‌రాజ్, జోసెఫ్ కలిసి ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆరోపించారు. పవన్ కళ్యాణ్‌ను ఒక కులానికి పరిమితం చేసే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే కుట్రలను ప్రభుత్వం ఉపేక్షించదని స్పష్టం చేశారు. ప్రకాశ్‌రాజ్ తాజా ట్వీట్‌పై స్పందించిన మంత్రి కందుల దుర్గేశ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు ఎంత చేసినా ప్రభుత్వం చట్టపరంగా వ్యవహరిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో విధ్వంసకర వాతావరణం సృష్టించాలనే ప్రయత్నాలను ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.


# ప్రశ్నిస్తే వేధింపులా ?..

### ప్రభుత్వంపై బొత్స తీవ్ర విమర్శలు

యూట్యూబ్ జర్నలిస్టుల అరెస్టులు ప్రభుత్వ కక్షసాధింపు రాజకీయాలకు నిదర్శనమని ఆరోపించారు శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే వారిని వేధించడం సరికాదన్నారు. వ్యక్తిగత దూషణలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని, భావప్రకటన స్వేచ్ఛను అణచివేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను పక్కనపెట్టి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపులకే ప్రాధాన్యం ఇస్తోందని బొత్స మండిపడ్డారు. మహిళలపై దాడులు, లాకప్ మరణాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో విషజ్వరాలు, రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడం, యూరియా కొరత వంటి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. హోంశాఖ పనితీరుపైనా ఆయన విమర్శలు చేశారు.

**• పాలన గాలికొదిలేసి, ప్రశ్నించే వారిపై వేధింపులు**

రెండేళ్ల పాలనలో చెప్పుకోదగ్గ ఒక్క కొత్త పథకం కూడా తీసుకురాలేదని బొత్స ఆరోపించారు. మూడు లక్షల కోట్లకు పైగా అప్పులు చేసినా అభివృద్ధి కనిపించడం లేదన్నారు. మహిళలకు సున్నా వడ్డీ బకాయిలు చెల్లించలేదని, విద్యార్థులకు ఇంకా స్కూల్ కిట్లు ఇవ్వలేదని విమర్శించారు. అమరావతిలో అవినీతి జరుగుతోందన్న తమ పార్టీ ఆరోపణలను మరోసారి ప్రస్తావించారు. ప్రభుత్వం పాలనను గాలికొదిలేసి ప్రతిపక్ష నేతలు, ప్రశ్నించే జర్నలిస్టులనే లక్ష్యంగా



చేసుకుందని బొత్స ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా వ్యక్తిగత విమర్శలకు పరిమితమైందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు, అభివృద్ధి అంశాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**• మీ పాలనతో ఏ ఒక్క వర్గం సంతోషంగా లేదు**

రైతులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు సహా ఏ వర్గం కూడా ప్రభుత్వ పాలనతో సంతృప్తిగా లేదని బొత్స అన్నారు. సంక్షేమం, అభివృద్ధి విషయంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. గతంలో వైఎస్ జగన్ శంకుస్థాపన చేసిన స్టీల్ ప్లాంట్‌కే ఇప్పుడు మళ్లీ భూమిపూజలు చేయడం ఎందుకని బొత్స ప్రశ్నించారు. ఇప్పటికే ప్రారంభమైన ప్రాజెక్టులను కొత్తవిగా చూపించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనన్నారు. విశాఖలో సింగపూర్ టౌన్‌షిప్ అంశంపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియకు మరో నెల గడువు పొడిగించాలని ఎన్నికల సంఘాన్ని కోరుతున్నట్లు తెలిపారు.

# 50 మంది బంగ్లాదేశీయుల బహిష్కరణ

### పశ్చిమ బెంగాల్‌కు తరలింపు

తమిళనాడులోని సేలం జిల్లా అత్తూర్ ప్రత్యేక నిర్బంధ శిబిరంలో ఉన్న 50 మంది బంగ్లాదేశ్ పౌరులను స్వదేశానికి పంపించే ప్రక్రియ ప్రారంభమైంది. 44 మంది పురుషులు, ఆరుగురు మహిళలను అధికారిక బహిష్కరణ ఉత్తర్వుల మేరకు కట్టుదిట్టమైన భద్రత మధ్య తొలుత రోడ్డు మార్గంలో తిరుచిరాపల్లికి తరలించారు. అక్కడి నుంచి హౌరా ఎక్స్‌ప్రెస్‌లో ప్రత్యేక బోగీలో పశ్చిమ బెంగాల్‌కు పంపించారు. వీరి భద్రత కోసం డీఎస్పీ శక్తివేల్ నేతృత్వంలో 40 మంది సాయుధ పోలీసులను ఎస్కార్ట్‌గా నియమించారు. పశ్చిమ బెంగాల్‌లోని హరిదాస్‌పూర్ సరిహద్దు వద్ద తమిళనాడు పోలీసులు వీరిని సరిహద్దు భద్రతా దళం బీఎస్ఎఫ్‌కు అప్పగించనున్నారు. అనంతరం బీఎస్ఎఫ్ అధికారులు బంగ్లాదేశ్ అధికారులకు వీరిని అధికారికంగా అప్పగించే ప్రక్రియ పూర్తి చేయనున్నారు. అక్రమంగా దేశంలోకి ప్రవేశించిన విదేశీయులను తాత్కాలికంగా ఉంచేందుకు ఏర్పాటు చేసిన అత్తూర్ ప్రత్యేక శిబిరంలో ప్రస్తుతం ఇంకా 130 మందికి పైగా విదేశీయులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీరి కేసులు విచారణలో ఉండగా, కొందరు బెయిల్‌పై ఉన్నట్లు వెల్లడించారు.

# పార్లమెంట్ వర్షా కాల షెడ్యూల్ ఖరారు

## జులై 20 నుంచి ఆగస్ట్ 13 వరకు సమావేశాలు

పార్లమెంట్ 2026 వర్షాకాల సమావేశాల షెడ్యూల్ ఖరారైంది. జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు లోక్‌సభ, రాజ్యసభ సమావేశాలు జరగనున్నట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా వేదిక ఎక్స్ ద్వారా ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ సిఫారసు మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సమావేశాలకు ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు.

**ఎక్స్ వేదికగా వెల్లడించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు**

దేశ ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశాలపై అర్థవంతమైన చర్చలు, సమగ్ర నిర్ణయాలు తీసుకునేందుకు ఈ సమావేశాలు వేదిక కానున్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న కీలక బిల్లులతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ, జాతీయ భద్రత, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ అంశాలపై విస్తృత చర్చలు జరిగే అవకాశం ఉంది.

**కీలక బిల్లులపై ప్రభుత్వ ఫోకస్**

వర్షాకాల సమావేశాల్లో ఎన్డీఏ ప్రభుత్వం పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా రెండు రాజ్యాంగ సవరణ బిల్లులు సభ ముందుకు వచ్చే అవకాశం ఉందని సమాచారం. 131వ రాజ్యాంగ సవరణ బిల్లుతో మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన అంశాలను సవరణలతో మళ్లీ తీసుకురావచ్చని తెలుస్తోంది. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల సభ్యుల సంఖ్యను 50 శాతం పెంచే ప్రతిపాదన కూడా ఇందులో ఉండొచ్చని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

**ప్రతిపక్షాల దూకుడు**

ఈ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వాన్ని వివిధ అంశాలపై నిలదీయడానికి ప్రతిపక్షాలు వ్యూహరచన చేస్తున్నాయి. ముఖ్యంగా నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం, అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, నిరుద్యోగ సమస్యలను ప్రధానంగా ప్రస్తావించే అవకాశం ఉంది. దేశీయ, అంతర్జాతీయ పరిణామాలతో పాటు పలు రాష్ట్రాలకు సంబంధించిన సమస్యలను కూడా సభలో లేవనెత్తేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి.

**ప్రభుత్వం కీలక విధానాలకు ప్రాధాన్యం**

కేంద్ర ప్రభుత్వం తన సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ విధానాలను సభ ముందు ఉంచేందుకు సిద్ధమవుతోంది. వివిధ రంగాలకు సంబంధించిన విధాన నిర్ణయాలు, కొత్త చట్టాలపై చర్చలు నిర్వహించే అవకాశం ఉంది. ప్రభుత్వ కార్యక్రమాల అమలు, భవిష్యత్ కార్యాచరణపై కూడా సభ్యులకు వివరించే అవకాశముంది.


**హాట్ హాట్‌గా సాగే సూచనలు**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందు ముగియనున్న ఈ సమావేశాల్లో అధికార పక్షం, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కీలక బిల్లులు, ప్రజా సమస్యలు, ఆర్థిక అంశాలు, జాతీయ భద్రత వంటి విషయాలపై విస్తృత చర్చలు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. దీంతో ఈసారి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు రాజకీయంగా అత్యంత ప్రాధాన్యం సంతరించుకుని దేశవ్యాప్తంగా ఆసక్తి రేకెత్తిస్తున్నాయి.



# పాప అడ్వాన్స్ లెక్కలు

- **కేతన్‌తో నా పెళ్లి జరగదు**
- **హత్య కేసులో స్నాప్‌చాట్ ట్విస్ట్**
- **వెలుగులోకి కొత్త విషయాలు**




పూణె వ్యాపారి కేతన్ హత్య కేసులో నిందితురాలు సియా గోయల్‌కు సంబంధించినట్లు చెబుతున్న స్నాప్‌చాట్ సంభాషణ వెలుగులోకి రావడం కేసులో కొత్త మలుపుగా మారింది. పెళ్లి జరగదని ముందుగానే సంకేతాలిచ్చేలా ఆమె తన స్నేహితురాలికి పంపినట్లు చెబుతున్న సందేశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ చాట్ నిజానిజాలపై ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది.

**కోడ్ భాషలో సంభాషణలు.. పోలీసుల అనుమానం**

మొబైల్ నుంచి తొలగించిన డేటాను రికవరీ చేసిన తర్వాత సియా గోయల్, చేతన్ చౌదరి కోడ్ భాష, మారుపేర్లతో మాట్లాడినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు పోలీసులు కోర్టుకు తెలిపారు. ఈ సంభాషణల అసలు అర్థం తెలుసుకోవడానికి ఇద్దరినీ ఎదురెదురుగా విచారించాల్సిన అవసరం ఉందని పోలీసులు పేర్కొన్నారు. అయితే అదనపు పోలీసు కస్టడీ అభ్యర్థనను కోర్టు తిరస్కరించి, ఇద్దరినీ 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపింది.

**'పెళ్లి జరగదు' అంటూ ఆధార్ కార్డు అడిగినట్లు చాట్**

దర్యాప్తులో భాగంగా బయటపడినట్లు చెబుతున్న స్నాప్‌చాట్ చాట్‌లో, ఒక స్నేహితురాలిని ఆధార్ కార్డు పంపించాలని సియా కోరినట్లు సమాచారం. "ఎప్పటికీ జరగని పెళ్లి కోసం టికెట్లు బుక్ చేయాలి" అని ఆమె సందేశంలో పేర్కొన్నట్లు దర్యాప్తు వర్గాలు అనుమానిస్తున్నాయి. హత్యకు ముందు కూడా పెళ్లి ఏర్పాట్లు కొనసాగుతున్నాయనే భావన కల్పించేందుకు ఇదంతా వ్యూహంలో భాగమా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. అయితే ఈ చాట్ ప్రామాణికత ఇంకా నిర్ధారణ కాలేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

**నార్కో పరీక్షకు నిందితుల నిరాకరణ**

విచారణ సందర్భంగా నార్కో పరీక్ష అంశం కూడా కోర్టు ముందుకు వచ్చింది. అయితే నిందితుల సమ్మతి లేకుండా నార్కో పరీక్షకు అనుమతి ఇవ్వలేమని కోర్టు స్పష్టం చేసింది. సియా గోయల్, చేతన్ చౌదరి ఇద్దరూ అంగీకరించకపోవడంతో కోర్టు అనుమతి నిరాకరించింది. ప్రాసిక్యూషన్ కూడా ప్రస్తుతం నార్కో పరీక్ష అవసరం లేదని తెలిపింది.

**లోహగడ్ కోట వద్ద మృతి.. ప్రమాదమా? హత్యా?**

ఎఫ్ఐఆర్ ప్రకారం, జూన్ 18న కేతన్ అగర్వాల్ తన ఇంటి నుంచి బయలుదేరి పుణే-ముంబై హైవేపై కివాలే బ్రిడ్జి వద్ద సియా గోయల్‌ను తీసుకుని లోహగడ్ కోటకు వెళ్లాడు. ఉదయం 10:45 గంటలకు సియా, కేతన్ తల్లికి ఫోన్ చేసి ఆయన లోయలో ప్రమాదవశాత్తు పడిపోయాడని చెప్పింది. స్థానికులు, పోలీసులు కేతన్‌ను ఆస్పత్రికి తరలించగా వైద్యులు మృతి చెందినట్లు ప్రకటించారు.

**హత్య కోణంలో దర్యాప్తు**

జూన్ 21న ఘటనాస్థలాన్ని పరిశీలించిన కేతన్ కుటుంబ సభ్యులు అది ప్రమాదవశాత్తు జారిపడే ప్రదేశం కాదని ఆరోపించారు. కేతన్‌ను సియా గోయల్, చేతన్ చౌదరి కలిసి లోయలోకి తోసేశారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. సియా ఫోన్ ఎప్పుడూ బిజీగా ఉండేదని, తరచూ చేతన్ గురించి ప్రస్తావించేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇద్దరి మధ్య సన్నిహిత సంబంధం ఉందనే అనుమానంతో పోలీసులు దర్యాప్తును కొనసాగిస్తున్నారు. స్నాప్‌చాట్ చాట్, మొబైల్ డేటా, ఇతర డిజిటల్ ఆధారాలన్నింటినీ విశ్లేషిస్తూ కేసు అసలు నిజాలను వెలికితీసే పనిలో దర్యాప్తు అధికారులు ఉన్నారు.



# అంతులేని కథ

- **పేరు మార్చుకోండి**
- **టీఆర్ఎస్ పేరు వద్దు**
- **ఫిర్యాదులతో నోటీసులు**
- **కవితకు ఎన్నికల సంఘం షాక్**
- **తగ్గేదేలేదన్న టీఆర్ఎస్ చీఫ్**
- **సుప్రీం కోర్టును ఆశ్రయిస్తానని వెల్లడి**

(మొదటి పేజీ తరువాయి..)

తెలంగాణ రక్షణ సేన పేరుపై అభ్యంతరాలు వచ్చినందున కొత్త పేర్లను సూచించాలని ఎన్నికల సంఘం కోరింది. పార్టీ పేరును మార్చకుండా రిజిస్ట్రేషన్ కొనసాగించడం సాధ్యం కాదని పేర్కొంది. 15 రోజుల గడువులో మూడు ప్రత్యామ్నాయ పేర్లు సమర్పించాలని సూచించింది. లేకపోతే దరఖాస్తును తిరస్కరించే అవకాశం ఉందని నోటీసులో స్పష్టం చేసింది.

**ప్రజల్లోకి వెళ్లింది టీఆర్ఎస్ పేరేనని కవిత**

భారత్ రాష్ట్ర సమితి నుంచి బయటకు వచ్చిన తర్వాత తెలంగాణ సెంటిమెంట్‌ను ప్రతిబింబించేలా తెలంగాణ రక్షణ సేన పేరును ఎంచుకున్నామని కవిత తెలిపారు. టీఆర్ఎస్ సంక్షిప్త నామంతోనే ప్రజల్లోకి వెళ్లామని, ఈ దశలో వెనక్కి తగ్గే ఆలోచన లేదన్నారు. ప్రజల్లో ఇప్పటికే పార్టీకి గుర్తింపు వచ్చిందని, అందుకే పేరు మార్చే ప్రశ్నే లేదని స్పష్టం చేశారు.

**సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని వెల్లడి**

ఎన్నికల సంఘం తమ వివరణను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకుంటే న్యాయపోరాటానికి సిద్ధమని కవిత ప్రకటించారు. అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించి చట్టపరంగా పోరాడతామని వెల్లడించారు. పార్టీ పేరును కాపాడుకునేందుకు అన్ని న్యాయపరమైన అవకాశాలను వినియోగించుకుంటామని చెప్పారు.

**రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా వివాదం**

ఎన్నికల సంఘం నోటీసులు, కవిత ప్రతిస్పందన తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. టెక్నికల్, న్యాయపరమైన అభ్యంతరాల నేపథ్యంలో ఈసీ నోటీసులు జారీ చేయడం, వాటిని కవిత తీవ్రంగా వ్యతిరేకించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. ఈ వివాదం కొత్త పార్టీ భవిష్యత్ రిజిస్ట్రేషన్‌పై ప్రభావం చూపే అవకాశం ఉన్నప్పటికీ, చట్టపరంగా పోరాడి పార్టీ పేరును కొనసాగించాలనే నిర్ణయంతో కవిత ముందుకు సాగుతున్నారు.

# జిమ్ పేరుతో స్టెరాయిడ్లు

- **ఆన్‌లైన్ ద్వారా విక్రయం**
- **ఆరుగురు ముఠా అరెస్ట్**

హైదరాబాద్‌లో అనుమతులు లేకుండా స్టెరాయిడ్ ఇంజెక్షన్లు, కండరాల పెరుగుదలకు ఉపయోగించే డ్రగ్స్ విక్రయిస్తున్న ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ముషీరాబాద్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ.6.5 లక్షల విలువైన స్టెరాయిడ్లు, బాడీ బిల్డింగ్ సప్లిమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

**ఆన్‌లైన్ జిమ్ ట్రైనర్ కీలక నిందితుడు**

అరెస్టైన వారిలో మాజీ ఐరన్ హౌస్ జిమ్ యజమాని, ప్రస్తుతం ఆన్‌లైన్ జిమ్ ట్రైనర్‌గా పనిచేస్తున్న బట్టె శివ ప్రధాన నిందితుడిగా పోలీసులు గుర్తించారు. అతడితో పాటు మహ్మద్ ఫుర్కానుద్దీన్ ఫైసల్, మహ్మద్ సైఫ్, ఫర్జాన్ ఖాన్, మహ్మద్ యూసుఫ్, సోంబట్టిని అభిలాష్‌ను అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముదిద్ చౌహాన్, పంజాబ్‌కు చెందిన రాజన్ ప్రీత్ సింగ్ పరారీలో ఉన్నారని తెలిపారు.

**మెడికల్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే సరఫరా**

ప్రధాన నిందితులు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే స్టెరాయిడ్ ఇంజెక్షన్లు, బాడీ బిల్డింగ్ సప్లిమెంట్లు కొనుగోలు చేసి, వాటిని నగరంలోని సబ్ డీలర్లకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం వాటిని జిమ్‌కు వచ్చే యువతకు విక్రయిస్తూ అక్రమంగా డబ్బు సంపాదిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల వద్ద నుంచి 440 టెర్మిన్ (నియాన్) వైల్స్, 336 మెఫెంటర్మిన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు, 50 టెస్టోస్టెరోన్ ఎనాంతేట్ ఇంజెక్షన్లు, సోమాట్రోపిన్, డ్రోస్టానోలోన్ ప్రోపియోనేట్ ఇంజెక్షన్లు, అమైనో యాసిడ్ సప్లిమెంట్లు, 336 బాడీ బిల్డింగ్ టాబ్లెట్లు, రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



**ఉత్తరప్రదేశ్, పంజాబ్ నుంచి సరఫరా**

బట్టె శివ మెడ్‌హౌస్ ఫార్మా అనే ఆన్‌లైన్ వేదిక ద్వారా స్టెరాయిడ్లను కొనుగోలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఉత్తరప్రదేశ్ నుంచి ముదిద్ చౌహాన్ కొరియర్ ద్వారా వాటిని పంపించి, యూసుఫ్, అభిలాష్ ద్వారా విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మరోవైపు ఫైసల్ షిప్ రాకెట్ అనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్ ద్వారా పంజాబ్‌కు చెందిన రాజన్ ప్రీత్ సింగ్ నుంచి డ్రగ్స్ తెప్పించి, మహ్మద్ సైఫ్, ఫర్జాన్ ఖాన్ ద్వారా విక్రయించినట్లు వెల్లడించారు.

**జిమ్ నిర్వాహకులకు పోలీసుల హెచ్చరిక**

జిమ్ యజమానులు, ఫిట్‌నెస్ ట్రైనర్లు, బాడీ బిల్డింగ్‌పై ఆసక్తి ఉన్నవారు ఇలాంటి ఇంజెక్షన్లు, కండరాల పెరుగుదల మందులను ఉపయోగించవద్దని పోలీసులు హెచ్చరించారు. నగరంలోని జిమ్ యజమానులు, ట్రైనర్లు, సభ్యుల వివరాలు తమ వద్ద ఉన్నాయని, ఇకపై ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తామని తెలిపారు. అనుమతులు లేకుండా స్టెరాయిడ్లు విక్రయించినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఆరోగ్యానికి హానికరమైన మందులపై యువత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# చచ్చేదాక పోరాడతా

**తిరుగుబాటుదారులకు దీదీ సవాల్**

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో తృణమూల్ కాంగ్రెస్ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి ఎదురైన పరాజయం తర్వాత అంతర్గత విభేదాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేలు, ఎంపీలు మమతా బెనర్జీ నాయకత్వాన్ని ప్రశ్నిస్తూ వేరు వర్గంగా మారడం రాజకీయంగా పెద్ద చర్చకు దారితీసింది. ఈ పరిస్థితుల్లో మమతా బెనర్జీ ఘాటుగా స్పందించారు. తనను ఆపాలంటే చంపాల్సిందేనని వ్యాఖ్యానిస్తూ తిరుగుబాటుదారులకు సవాల్ విసిరారు.

**'ద్రోహులు' అంటూ మండిపాటు**

తనకు వ్యతిరేకంగా నిలిచిన నాయకులపై మమత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిని నేరుగా ద్రోహులుగా అభివర్ణించారు. పార్టీ గుర్తు తనతో ఉన్న నాయకులకే ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం ముందు చట్టపరమైన పోరాటం జరిగినా వెనక్కి తగ్గబోనని వెల్లడించారు. పార్టీ సిద్ధాంతాలను వదిలి వెళ్లిన వారికి ప్రజలే సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు.


**చంద్రిమ రాజీనామాతో కొత్త దెబ్బ**

తృణమూల్ బెంగాల్ రాష్ట్ర అధ్యక్షురాలు చంద్రిమ భట్టాచార్య రాజీనామా చేయడం మమతకు మరో పెద్ద ఎదురుదెబ్బగా మారింది. కొద్దిరోజుల క్రితమే ఆ బాధ్యతలు చేపట్టిన ఆమె తిరుగుబాటు వర్గంతో కలవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అయితే తన రాజీనామా గురించి ముందుగానే సమాచారం ఇచ్చిందని మమత తెలిపారు. ఆమె కుమారుడు ఇప్పటికే తిరుగుబాటు వర్గంలో చేరిన కారణంగా ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు.

**బీజేపీ ఒత్తిడేనని ఆరోపణ**

తిరుగుబాటు చేసిన నేతలు బీజేపీ ఒత్తిడికి లోనయ్యారని మమత ఆరోపించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ బీజేపీ ముందు తాను తలవంచబోనని స్పష్టం చేశారు. తృణమూల్ సిద్ధాంతాలు బీజేపీకి పూర్తిగా వ్యతిరేకమని గుర్తు చేశారు. రెండు నెలల క్రితమే పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేసిన నాయకులు ఇప్పుడు ఎలా ద్రోహులుగా మారారో ప్రజలే ఆలోచించాలని అన్నారు.

**పార్టీ కార్యాలయంపై వివాదం**



కోల్‌కతాలోని తృణమూల్ పార్టీ కార్యాలయాన్ని తిరుగుబాటు వర్గం స్వాధీనం చేసుకోవడంపై మమత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ కార్యాలయం లీజుపై తీసుకున్నదని, అది పార్టీ ఆస్తి అని చెప్పారు. వ్యక్తులు పార్టీని వీడొచ్చు కానీ పార్టీ అనే సంస్థ అంతమవదని స్పష్టం చేశారు. బలవంతంగా పార్టీ ఆస్తులను స్వాధీనం చేసుకునే హక్కు ఎవరికీ లేదని హెచ్చరించారు. ఇకపై తన నివాసంలోని కార్యాలయమే ప్రధాన పార్టీ కార్యాలయంగా పనిచేస్తుందని ప్రకటించారు.

**ఎన్నికల సంఘం ముందుకు వివాదం**

పార్టీలో చీలిక మరింత తీవ్రమవడంతో అసలు తృణమూల్ కాంగ్రెస్ ఎవరిదన్న అంశం ఎన్నికల సంఘం ముందుకు చేరింది. ఇరు వర్గాలు తమ వాదనలు సమర్పించాలని ఎన్నికల సంఘం జులై 6 సాయంత్రం 5.30 గంటల వరకు గడువు ఇచ్చింది. పార్టీ గుర్తు, అధికారిక హోదాపై తుది నిర్ణయం ఎన్నికల సంఘం తీసుకోనుంది.

## ఉల్లి రైతులకు కేంద్రం శుభవార్త

- **కనీస మద్దతు ధర 13% పెంపు**

ఉల్లి రైతులకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చింది. ఉల్లి కనీస మద్దతు ధరను 13 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. తాజా పెంపుతో క్వింటాల్ ధర రూ.1,875 నుంచి రూ.2,125కు చేరింది. పెరిగిన ధర వెంటనే అమల్లోకి వస్తుందని కేంద్రం ప్రకటించింది. ఉల్లి సేకరణను పెంచడంతో పాటు రైతులకు మెరుగైన ఆదాయం కల్పించడమే లక్ష్యమని తెలిపింది. బఫర్ స్టాక్ సేకరణ మందగించడంతో ఇటీవల పలుమార్లు ధరలను పెంచిన కేంద్రం, ఇప్పుడు మరోసారి మద్దతు ధరను సవరించింది. 2025-26లో దేశంలో ఉల్లి ఉత్పత్తి 307.33 లక్షల టన్నులకు చేరుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది.

# ఇంజిన్ డామేజ్ నిజమా?

- **ఈ20 పెట్రోల్‌పై అపోహలు**
- **కేంద్రం 10 కీలక వివరణలు**
- **ప్రమాదంలో వెహికల్స్ ప్రచారం**
- **అంతా ఉత్తదే అంటున్న కేంద్రం**

ఈ 20 పెట్రోల్‌పై సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న అపోహలకు కేంద్ర ప్రభుత్వం చెక్ పెట్టింది. ఇంధనంలో 20 శాతం ఇథనాల్ కలిపే ఈ20 కార్యక్రమంపై వస్తున్న ప్రచారాన్ని ఖండిస్తూ పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వ శాఖ 10 అంశాలతో కూడిన సమగ్ర వివరణ విడుదల చేసింది. శాస్త్రీయ అధ్యయనాలు, అంతర్జాతీయ అనుభవం, నియంత్రణ ప్రమాణాల ఆధారంగానే ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని స్పష్టం చేసింది.

**ఇథనాల్ తయారీకి వేల లీటర్ల నీరు అవసరమనే ప్రచారం తప్పు**

ఒక లీటర్ ఇథనాల్ తయారీకి 10 వేల లీటర్ల నీరు అవసరమని జరుగుతున్న ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. ఆహార భద్రతకు అవసరమైన నిల్వలు మిగిలిన తర్వాత మాత్రమే అదనపు బియ్యాన్ని ఇథనాల్ తయారీకి వినియోగిస్తున్నామని తెలిపింది. ఒక్కో లీటర్ ఇథనాల్ తయారీకి కేవలం 3 నుంచి 5 లీటర్ల శుద్ధి చేసిన నీరు మాత్రమే ఉపయోగిస్తారని, చాలా పరిశ్రమలు జీరో లిక్విడ్ డిశ్చార్జ్ విధానంతో నీటిని తిరిగి వినియోగిస్తున్నాయని వెల్లడించింది.

**ఇంజిన్ దెబ్బతింటుందనే వాదనలో నిజం లేదు**

ఈ20 పెట్రోల్ వల్ల వాహన ఇంజిన్లు దెబ్బతింటాయనే ప్రచారాన్ని కూడా కేంద్రం తిరస్కరించింది. ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఆయిల్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం, సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ నిర్వహించిన పరీక్షల్లో ఇంజిన్ పనితీరుపై ప్రతికూల ప్రభావం కనిపించలేదని తెలిపింది. పాత వాహనాల్లో కొన్ని రబ్బరు భాగాలను ముందుగానే మార్చాల్సిన అవసరం ఉండొచ్చని మాత్రమే పేర్కొంది.




**ఈ20 కొత్త ఇంధనం కాదని స్పష్టీకరణ**

ఇథనాల్ మిశ్రమ ఇంధనం కొత్త ప్రయోగం కాదని కేంద్రం తెలిపింది. అమెరికా, బ్రెజిల్, కెనడా, థాయ్‌లాండ్, జపాన్, పలు యూరోప్ దేశాల్లో దశాబ్దాలుగా ఇథనాల్ మిశ్రమ ఇంధనం వినియోగంలో ఉందని గుర్తుచేసింది. భారత్‌లో కూడా విస్తృత పరీక్షల తర్వాతే ఈ20ను అమలు చేశామని పేర్కొంది. ఈ 20 పెట్రోల్ వాడితే వాహన వారంటీ, బీమా రద్దవుతాయనే ప్రచారాన్ని కేంద్రం పూర్తిగా ఖండించింది. ఈ20కు అనుకూలంగా రూపొందించిన లేదా ఆమోదం పొందిన వాహనాలకు వారంటీ, బీమా యథావిధిగా వర్తిస్తాయని వాహన తయారీ సంస్థలు, బీమా సంస్థలు స్పష్టం చేశాయని తెలిపింది.

**చీమలు, తేనెటీగలు వస్తాయనే ప్రచారం కూడా అవాస్తవమే**

ఈ20లో చక్కెర ఉండటంతో చీమలు, తేనెటీగలు ఆకర్షితమవుతాయనే వైరల్ పోస్టులను కూడా కేంద్రం తప్పుబట్టింది. ఇంధన గ్రేడ్ ఇథనాల్ తయారీ సమయంలో చక్కెర పూర్తిగా తొలగిపోతుందని, పురుగులను దూరంగా ఉంచే పదార్థాలు అందులో కలుపుతారని వివరించింది. ఈ20 కార్యక్రమం వల్ల విదేశీ మారకద్రవ్యంలో రూ.1.9 లక్షల కోట్లకు పైగా ఆదా జరిగిందని కేంద్రం వెల్లడించింది. రైతులకు రూ.1.6 లక్షల కోట్లకు పైగా చెల్లింపులు జరిగాయని తెలిపింది. కార్బన్ డైఆక్సైడ్ ఉద్గారాలు సుమారు 930 లక్షల మెట్రిక్ టన్నులు తగ్గాయని, 310 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ముడి చమురు దిగుమతులు తగ్గినట్లు పేర్కొంది. 2025 డిసెంబర్‌లోనే 20 శాతం ఇథనాల్ మిశ్రమ లక్ష్యాన్ని భారత్ ముందుగానే సాధించిందని, ప్రస్తుతం దేశంలో ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యం 2,000 కోట్ల లీటర్లకు చేరిందని కేంద్రం వెల్లడించింది.

# ఖమేనీకి తుది వీడ్కోలు

- **లక్షలాది మందితో అంతిమ యాత్ర**
- **భారీగా తరలివచ్చిన దేశాధినేతలు, ప్రజలు**

ఇరాన్ అత్యున్నత నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు టెహ్రాన్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. యుద్ధం ప్రారంభమైన రోజే జరిగిన వైమానిక దాడిలో మరణించిన ఖమేనీకి తుది వీడ్కోలు పలికేందుకు దేశ నలుమూలల నుంచి లక్షలాది మంది ప్రజలు తరలివచ్చారు. రాజధానిలోని గ్రాండ్ మొసల్లా ప్రార్థనా మందిరంలో ఆయన భౌతికకాయాన్ని గాజు శవపేటికలో ఉంచగా వేలాది మంది కన్నీటి పర్యంతమయ్యారు. ఇరాన్ జెండాలు, ఖమేనీ చిత్రాలతో ప్రజలు నివాళులు అర్పించారు. షియా సంప్రదాయం ప్రకారం ఛాతీలు బాదుకుంటూ శోకాన్ని వ్యక్తం చేశారు. నగరమంతా ఖమేనీ చిత్రాలతో భారీ హోర్డింగులు ఏర్పాటు చేయగా అంత్యక్రియలు పలుదినాల పాటు కొనసాగనున్నాయి.

**ప్రతీకార నినాదాలతో ఉద్రిక్తత**

అంత్యక్రియల సందర్భంగా "ప్రతీకారం తప్పదు" అంటూ ప్రజలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఖమేనీ కుమారుడు మొజ్తబా ఖమేనీ ఇటీవలే కొత్త అత్యున్నత నాయకుడిగా బాధ్యతలు చేపట్టినప్పటికీ ఇప్పటివరకు బహిరంగంగా కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. ఆయన హాజరుపై అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది. ఖమేనీ కుటుంబ సభ్యుల మృతదేహాలను కూడా ప్రత్యేక వేదికపై ఉంచి ప్రభుత్వ లాంఛనాలతో నివాళులు అర్పించారు.

**విదేశీ ప్రతినిధుల హాజరు**

ఖమేనీ అంత్యక్రియలకు పలు దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలోని బృందం నివాళులు అర్పించింది. హిజ్బుల్లా, హమాస్ ప్రతినిధులు కూడా కార్యక్రమంలో పాల్గొని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఖ్చీతో సమావేశమయ్యారు. భారత ప్రతినిధి బృందంలో భాగంగా పీడీపీ అధినేత మెహబూబా ముఫ్తీ కూడా ఖమేనీకి నివాళులు అర్పించారు. మరోవైపు పశ్చిమాసియా పరిస్థితులపై చర్చలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ మధ్య వచ్చే వారం సమావేశం జరిగే అవకాశం ఉందని సమాచారం వెలువడింది.



**యుద్ధం తర్వాత మారుతున్న పరిస్థితులు**

పశ్చిమాసియా యుద్ధం తర్వాత ప్రాంతీయ రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. అమెరికా-ఇరాన్ ఒప్పందాన్ని దెబ్బతీయకూడదని టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డొగాన్ హెచ్చరించారు. సంభాషణ, దౌత్యమే శాశ్వత పరిష్కారానికి మార్గమని పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ అభిప్రాయపడ్డారు. ఖమేనీ అంత్యక్రియలు కేవలం సంతాప కార్యక్రమమే కాకుండా ఇరాన్ రాజకీయ బలం, ప్రజల ఐక్యతను ప్రపంచానికి చాటే వేదికగా మారాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం టెహ్రాన్‌లో భద్రతను అత్యంత కట్టుదిట్టం చేశారు. అంత్యక్రియల అనంతరం ఇరాన్ తదుపరి రాజకీయ దిశపై ప్రపంచ దృష్టి కేంద్రీకృతమైంది.

ప్రభాత
# కిరణమ్
సత్యానికి వారధి

4
GENERAL NEWS
ఆదివారం 05 జులై 2026
www.prabhathakiranam.com


## ప్రసిద్ధ బద్రీనాథ్ ఆలయంలో స్కామ్
### నిధుల దుర్వినియోగం ఆరోపణలతో కాక

బద్రీనాథ్ ఆలయంలో ఆర్థిక అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు కలకలం రేపాయి. భైరవ సేన అనే సంస్థ చేసిన ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ అంతర్గత విచారణకు ఆదేశించింది. నిధుల దుర్వినియోగంపై సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో విచారణ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు బీకేటీసీ అధ్యక్షుడు హేమంత్ ద్వివేది తెలిపారు. ఈ వ్యవహారానికి సంబంధించి విధుల్లో ఉన్న ఉద్యోగుల వివరాలను కూడా సేకరిస్తున్నామని చెప్పారు. సోషల్ మీడియాలో తన వ్యక్తిగత కార్యదర్శిగా ప్రచారం జరుగుతున్న వ్యక్తి సాధారణ ఉద్యోగి మాత్రమేనని, గతంలో పలువురు మాజీ ఛైర్మన్ల వద్ద పనిచేశారని స్పష్టం చేశారు. ప్రధాన కార్యనిర్వాహక అధికారి సోహన్ సింగ్ రంగడ్ మాట్లాడుతూ, సీసీటీవీ ఫుటేజీని పరిశీలించినా స్పష్టమైన ఆధారాలు లభించలేదన్నారు. అయినప్పటికీ విషయాన్ని సున్నితంగా భావించి పూర్తి స్థాయి విచారణకు చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. విచారణలో ఎవరైనా తప్పు చేసినట్లు తేలితే బీకేటీసీ చట్టం-1939, ఉద్యోగుల ప్రవర్తనా నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. నిరాధార ప్రచారాలను నమ్మొద్దని భక్తులకు ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.

## ఇరాక్ ఎంపీ ఇంట్లో బంగారు లోదుస్తులు
### అవినీతి నిరోధకశాఖ దాడితో వెలుగులోకి



ఇరాక్‌లో ఓ మహిళా ఎంపీ ఇంటిపై అవినీతి నిరోధక శాఖ నిర్వహించిన దాడిలో సంచలన విషయాలు వెలుగుచూశాయి. ఎంపీ అలియా నస్సీఫ్ నివాసంలో అధికారులు బంగారం, వజ్రాలు, భారీ నగదు, విలాసవంతమైన వస్తువులతో పాటు బంగారంతో తయారు చేసిన ఖరీదైన లోదుస్తులను గుర్తించారు. ఈ బంగారు బికినీ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దాడిలో 1.33 కోట్ల డాలర్ల నగదు, బంగారం, నగలు స్వాధీనం చేసుకున్నారు. భవనాలు, ఇతర ఆస్తులను కూడా అధికారులు సీజ్ చేశారు. మొత్తం స్వాధీనం చేసుకున్న అక్రమ ఆస్తుల విలువ 8.5 కోట్ల డాలర్లు, భారత కరెన్సీలో సుమారు రూ.809 కోట్లు ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఈ ఘటన ఇరాక్‌లో తీవ్ర చర్చకు దారితీసింది.

## పాపికొండల యాత్రకు మళ్లీ గ్రీన్ సిగ్నల్



భద్రతా కారణాలతో గత నెల చివరి వారంలో తాత్కాలికంగా నిలిపివేసిన పాపికొండల బోటింగ్ విహారయాత్రను అధికారులు మళ్లీ ప్రారంభించారు. గోదావరి నదిలో వరద ఉధృతి తగ్గడం, బోట్ల ఫిట్‌నెస్, భద్రతా ప్రమాణాలను పరిశీలించిన తర్వాత అనుమతి ఇచ్చారు. రాజమండ్రి పుష్కర ఘాట్, భద్రాచలం నుంచి యధావిధిగా బోటింగ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ యాత్రలో గండిపోచమ్మ ఆలయం, పాపికొండల ప్రకృతి అందాలు, పేరంటాలపల్లి ఆశ్రమాన్ని సందర్శించే అవకాశం ఉంటుంది. పర్యాటకుల భద్రత కోసం ప్రతి బోటులో లైఫ్ జాకెట్లు, అనుభవజ్ఞులైన సిబ్బందిని ఏర్పాటు చేశారు. పెద్దలకు టికెట్ ధర రూ.1,250గా, 5 నుంచి 10 సంవత్సరాల లోపు పిల్లలకు రూ.1,050గా నిర్ణయించారు. బోటింగ్ పునఃప్రారంభంతో గోదావరి పరివాహక ప్రాంతంలో పర్యాటక సందడి మళ్లీ పెరిగే అవకాశం కనిపిస్తోంది.



## యుగానికి ఒక్కడు

- సూరీడు వచ్చేశాడు!
- 15 ఏళ్లకే వైభవ్ చరిత్ర
- 37 ఏళ్ల రికార్డు కనుమరుగు..!
- ఇంగ్లండ్‌తో రెండో టీ20లో అరంగేట్రం

యుగానికి ఒక్కడు వచ్చాడు... భారత క్రికెట్‌కు కొత్త సూర్యుడు ఉదయించాడు! 15 ఏళ్ల కుర్రాడి బ్యాట్ గర్జనతో 37 ఏళ్ల చరిత్ర ఒక్కసారిగా తలకిందులైంది. ప్రపంచం మొత్తం చూస్తుండగానే వైభవ్ సూర్యవంశీ అనే పేరు భారత క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడింది. మాంచెస్టర్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టీ20లో అరంగేట్రం చేసిన ఈ టీనేజ్ సంచలనం, కేవలం భారత జట్టులో చోటు దక్కించుకోవడమే కాదు... దాదాపు నాలుగు దశాబ్దాలుగా చెక్కుచెదరని సచిన్ టెండూల్కర్ రికార్డును కూడా ఛేదించాడు. (వివరాలు 8లో..)



## అతి వేగం, నిర్లక్ష్యమే కారణం

- గంటకు 20 ప్రాణాలు బలి
- రోడ్లపై పెరుగుతున్న మరణాలు


దేశంలో రోడ్డు ప్రమాదాలు రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతున్నాయి. అతివేగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా ప్రతి గంటకు సగటున 20 మంది ప్రాణాలు కోల్పోతున్నట్లు తాజా గణాంకాలు చెబుతున్నాయి. 2024లో దేశవ్యాప్తంగా 4.8 లక్షలకు పైగా రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా కూడా రోడ్డు ప్రమాదాలు అకాల మరణాలు, శాశ్వత వికలాంగత్వానికి ప్రధాన కారణంగా మారాయని నివేదికలు వెల్లడిస్తున్నాయి. (వివరాలు 2లో..)

# వేల ఎకరాల ఫామ్‌హౌజ్‌లు ఎలా వచ్చాయ్?

మిడ్జిల్ మండల ప్రజలు 2006లో నాటిన మొక్క నేడు మహావృక్షంగా మారి ప్రజలకు సేవ చేసే స్థాయికి తీసుకొచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తన రాజకీయ జీవితానికి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్‌లో నిర్వహించిన రాజకీయ కృతజ్ఞత సభలో ఆయన మాట్లాడారు. ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కడం తన అదృష్టమని, తన రాజకీయ ప్రయాణానికి బలంగా నిలిచిన మిడ్జిల్ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పారు.

### పాలమూరు నుంచి ఎందరో మహానుభావులు

పాలమూరు జిల్లా గొప్ప నాయకులను దేశానికి అందించిందని సీఎం గుర్తు చేశారు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి వంటి మహానుభావులు ఈ నేల నుంచే ఎదిగారని అన్నారు. పాలమూరు బిడ్డలు దేశాన్ని నడిపే సత్తా కలిగిన వారని, పాలనలో తమ ముద్ర వేయగలరని వ్యాఖ్యానించారు.



వివరాలు5లో..

- బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేసింది
- మిడ్జిల్‌లో నాటిన మొక్క మహావృక్షమైంది
- పేదలకు సేవచేసే భాగ్యం దక్కడం అదృష్టం
- మిడ్జిల్ కృతజ్ఞతా సభలో సీఎం రేవంత్ రెడ్డి



## కాకి లెక్కలు

- భట్టి విక్రమార్క గోబెల్స్ ప్రచారం
- అప్పుల లెక్కలపై హరీశ్ ఫైర్

రాష్ట్ర ప్రభుత్వ అప్పుల విషయంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తప్పుడు లెక్కలు చెబుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్ర అప్పులపై ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవాలను వక్రీకరిస్తోందని మండిపడ్డారు. (5లో..)



## జాగోరే.. జాగో

- హిందువులపై రేవంత్ సర్కార్ కుట్ర
- మజ్లిస్‌తో కమ్మక్కై ఓట్ల తొలగించే పన్నాగం
- అదే జరిగితే తెలంగాణలో మైనార్టీలవుతాం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ హాట్ కామెంట్స్

రాష్ట్ర ప్రభుత్వం "సర్" ప్రక్రియను ఉపయోగించుకుని హిందువుల ఓట్లను తొలగించే కుట్ర చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పనిచేసే పరిస్థితి లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. తెలంగాణ హిందువులంతా అప్రమత్తంగా ఉండాలని, లేదంటే రాష్ట్రంలో హిందువులే మైనారిటీలయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. (వివరాలు 5లో..)



## ఎంపీ సీఎంతో తెలంగాణ సీఎస్

- ఫొటోతో మొదలైన రాజకీయ చర్చ
- సీఎస్ సంజయ్ జాజు ప్రకటనపై రచ్చ

తెలంగాణ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నియామకాన్ని పురస్కరించుకుని మధ్యప్రదేశ్‌లోని ఓ దినపత్రికలో శుభాకాంక్షల ప్రకటన ఇప్పుడు సంచలనంగా మారింది. సాధారణ అభినందన ప్రకటనగా కనిపించిన ఈ ప్రకటన ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దీనికి కారణం ప్రకటనలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్‌తో సంజయ్ జాజు కలిసి ఉన్న ఫొటో ప్రచురించడమే. (వివరాలు 5లో..)




AI GENERATED

## ఇంజిన్ డామేజ్ నిజమా?

- ఈ20 పెట్రోల్‌పై అపోహలు
- కేంద్రం 10 కీలక వివరణలు
- ప్రమాదంలో వెహికల్స్ ప్రచారం
- అంతా ఉత్తదే అంటున్న కేంద్రం

ఈ 20 పెట్రోల్‌పై సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న అపోహలకు కేంద్ర ప్రభుత్వం చెక్ పెట్టింది. ఇంధనంలో 20 శాతం ఇథనాల్ కలిపే ఈ20 కార్యక్రమంపై వస్తున్న ప్రచారాన్ని ఖండిస్తూ పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వ శాఖ 10 అంశాలతో కూడిన సమగ్ర వివరణ విడుదల చేసింది. శాస్త్రీయ అధ్యయనాలు, అంతర్జాతీయ అనుభవం, నియంత్రణ ప్రమాణాల ఆధారంగానే ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని స్పష్టం చేసింది. (వివరాలు 3లో..)



## అంతులేని కథ

- పేరు మార్చుకోండి, టీఆర్ఎస్ పేరు వద్దు
- ఫిర్యాదులతో నోటీసులు
- కవితకు ఎన్నికల సంఘం షాక్
- తగ్గేదేలేదన్న టీఆర్ఎస్ చీఫ్
- సుప్రీం కోర్టును ఆశ్రయిస్తానని వెల్లడి

కల్వకుంట్ల కవిత స్థాపించిన తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. పార్టీ పేరుపై ప్రజల నుంచి అభ్యంతరాలు వచ్చిన నేపథ్యంలో ప్రస్తుత పేరును కొనసాగించేందుకు వీల్లేదని స్పష్టం చేసింది. 15 రోజుల్లో మూడు ప్రత్యామ్నాయ పేర్లను సమర్పించాలని, లేకపోతే పార్టీ రిజిస్ట్రేషన్ దరఖాస్తును తిరస్కరించే అవకాశం ఉంటుందని హెచ్చరించింది. దీంతో కవిత కొత్త పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కీలక మలుపు చోటుచేసుకుంది.

### అలాంటి ప్రసక్తి లేదంటూ స్పష్టం చేసిన కవిత

ఎన్నికల సంఘం నోటీసులపై కల్వకుంట్ల కవిత ఘాటుగా స్పందించారు. తమకు ఈసీ లేఖ అందిందని, అందులో లేవనెత్తిన రెండు ప్రధాన అభ్యంతరాలకు ఇప్పటికే పూర్తి స్థాయిలో చట్టపరమైన వివరణ ఇచ్చామని తెలిపారు. తమ పార్టీ సంక్షిప్త నామం టీఆర్ఎస్గానే కొనసాగుతుందని, కొత్త పేరు లేదా ప్రత్యామ్నాయ సంక్షిప్త నామం ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. (వివరాలు 3లో..)



## ఫుడ్ తింటున్నామా? విషం తింటున్నామా?

6లో..

- హైదరాబాద్‌ను కుదిపేస్తున్న ఆహార కల్తీ మాఫియా
- కల్తీ ఫుడ్‌కు చిరునామాగా భాగ్యనగరం

ఉదయం నిద్రలేవగానే ఒక గ్లాస్ పాలు... మధ్యాహ్నం అన్నంలో కూర... సాయంత్రం పిల్లలకు బిస్కెట్లు... రాత్రి బయట హోటల్‌లో భోజనం. ఇవన్నీ మన రోజువారీ జీవితంలో సాధారణ దృశ్యాలే. కానీ ఆ పళ్లెంలో కనిపించేది ఆహారమా? లేక నెమ్మదిగా శరీరాన్ని దెబ్బతీసే విషమా? ఊహించని ఈ ప్రశ్న ఇప్పుడు హైదరాబాద్‌ను కలవరపెడుతోంది. ఎక్కువ లాభాల కోసం కొందరు వ్యాపారులు కల్తీని వ్యాపారంగా మార్చి ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారు. రసాయనాలతో మగ్గించిన పండ్లు, నాసిరకం నూనెలు, నకిలీ పాల ఉత్పత్తులు, కల్తీ మసాలాలు, నాణ్యత లేని ఆహార పదార్థాలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. ఈ దందా ఎంత లోతుగా పాతుకుపోయిందో హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ (హెచ్‌ఫాస్ట్) వంద రోజుల దాడులు బయటపెట్టాయి. ప్రతి స్వాధీనం వెనుక వేల కుటుంబాల ఆరోగ్యం దాగి ఉంది. ప్రతి ముద్ద తినే ముందు ఒక్కసారి ఆలోచించాల్సిన పరిస్థితి వచ్చిందంటే... ఇది సాధారణ సమస్య కాదు, ప్రతి ఇంటి గడపను తట్టిన ప్రమాద ఘంటిక.




### వామ్మో హోటల్ ఫుడ్

- బయట భోజనమే ఇష్టమా?
- ఐతే మీ ఆరోగ్యం గల్లంతే!
- నగర హోటళ్లలో నాణ్యత డొల్ల
- హెచ్-ఫాస్ట్ దాడుల్లో షాకింగ్ నిజాలు

## పాప అడ్వాన్స్ లెక్కలు

- కేతన్‌తో నా పెళ్లి జరగదు
- హత్య కేసులో స్నాప్‌చాట్ ట్విస్ట్
- వెలుగులోకి కొత్త విషయాలు

పూణె వ్యాపారి కేతన్ హత్య కేసులో నిందితురాలు సియా గోయల్‌కు సంబంధించినట్లు చెబుతున్న స్నాప్‌చాట్ సంభాషణ వెలుగులోకి రావడం కేసులో కొత్త మలుపుగా మారింది. పెళ్లి జరగదని ముందుగానే సంకేతాలిచ్చేలా ఆమె తన స్నేహితురాలికి పంపినట్లు చెబుతున్న సందేశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ చాట్ నిజానిజాలపై ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది. (వివరాలు 3లో..)



AI GENERATED

## పార్లమెంట్ వర్షాకాల షెడ్యూల్ ఖరారు

### జూలై 20 నుంచి ఆగస్ట్ 13 వరకు సమావేశాలు



3లో..



3లో..

## జిమ్ పేరుతో స్టెరాయిడ్లు

- ఆన్‌లైన్ ద్వారా విక్రయం
- ఆరుగురు ముఠా అరెస్ట్

హైదరాబాద్‌లో అనుమతులు లేకుండా స్టెరాయిడ్ ఇంజెక్షన్లు, కండరాల పెరుగుదలకు ఉపయోగించే డ్రగ్స్ విక్రయిస్తున్న ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ముషీరాబాద్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఆరుగురిని అదుపులోకి తీసుకుని సుమారు రూ.6.5 లక్షల విలువైన స్టెరాయిడ్లు, బాడీ బిల్డింగ్ సప్లిమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

### ఆన్‌లైన్ జిమ్ ట్రైనర్ కీలక నిందితుడు

అరెస్టైన వారిలో మాజీ ఐరన్ హౌస్ జిమ్ యజమాని, ప్రస్తుతం ఆన్‌లైన్ జిమ్ ట్రైనర్‌గా పనిచేస్తున్న బట్టె శివ ప్రధాన నిందితుడిగా పోలీసులు గుర్తించారు. అతడితో పాటు మహ్మద్ ఫుర్కానుద్దీన్ ఫైసల్, మహ్మద్ సైఫ్, ఫర్హాన్ ఖాన్, మహ్మద్ యూసుఫ్, సోంబట్టిని అభిలాష్‌ను అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముదిద్ చౌహాన్, పంజాబ్‌కు చెందిన రాజన్ ప్రీత్ సింగ్ పరారీలో ఉన్నారని తెలిపారు.

# వామ్మో.. హోటల్ ఫుడ్

- బయట భోజనమే ఇష్టమా?
- ఐతే మీ ఆరోగ్యం గల్లంతే!
- నగర హోటళ్లలో నాణ్యత డొల్ల
- హెచ్-ఫాస్ట్ దాడుల్లో షాకింగ్ నిజాలు



**హైదరాబాద్ నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీల్లో ఆహార నాణ్యతపై ఆందోళనకర పరిస్థితులు వెలుగుచూశాయి. అపరిశుభ్ర వాతావరణంలో ఆహార తయారీ, కల్తీ పదార్థాల వినియోగం, నాణ్యతలేని మాంసం విక్రయాలు పెద్ద ఎత్తున బయటపడుతున్నాయి. ఆహార భద్రత కోసం ఏర్పాటు చేసిన హెచ్‌ఫాస్ట్ ప్రత్యేక బృందం నిర్వహించిన దాడుల్లో భారీగా అక్రమాలు వెలుగులోకి వచ్చాయి.**

### దాడులు చేస్తున్నా పట్టించుకోకుండా అమ్మకాలు

మార్చి 19 నుంచి ప్రారంభమైన హెచ్‌ఫాస్ట్ దాడులకు 100 రోజులు పూర్తయ్యాయి. ఈ కాలంలో వరుస తనిఖీలు, హెచ్చరికలు కొనసాగుతున్నప్పటికీ కొందరు వ్యాపారులు నిబంధనలను పట్టించుకోకుండా కల్తీ, నాణ్యతలేని ఆహార పదార్థాల విక్రయాలు కొనసాగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే విధంగా వ్యాపారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు.

### వంద రోజుల్లో 185 కేసులు నమోదు

గత 100 రోజుల్లో హెచ్‌ఫాస్ట్ అధికారులు మొత్తం 185 కేసులు నమోదు చేశారు. రాజేంద్రనగర్ జోన్‌లో అత్యధికంగా 55 కేసులు, గోల్కొండ జోన్‌లో 44 కేసులు నమోదయ్యాయి. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 90 కేసులు నమోదు చేయగా, పనీర్ విక్రయ కేంద్రాలపై మాత్రమే 70 కేసులు నమోదయ్యాయి. ఆరోగ్యానికి హానికరమైన 247 కేసులను జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగానికి బదిలీ చేశారు.

### 121.87 టన్నుల కల్తీ ఆహారం స్వాధీనం

దాడుల్లో మొత్తం 121.87 టన్నుల కల్తీ, నాణ్యత లేని ఆహార పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 27 టన్నులకు పైగా నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్, రసాయనాలతో మగ్గబెట్టిన 25.8 టన్నుల పండ్లు, 60 టన్నులకు పైగా చికెన్ వ్యర్థాలు, 15 టన్నుల నాసిరకం చికెన్, మాంసాన్ని సీజ్ చేశారు. కల్తీ కోవా, పనీర్, పెరుగు, నెయ్యి, క్రీమ్, టీ పొడి కూడా పెద్ద మొత్తంలో పట్టుబడ్డాయి.

### హోటళ్లు, రెస్టారెంట్లకు కఠిన మార్గదర్శకాలు

నాణ్యమైన ఆహారం అందించే విషయంలో హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు తప్పనిసరిగా ఆహార భద్రత నిబంధనలు పాటించాలని హెచ్‌ఫాస్ట్ అధికారులు స్పష్టం చేశారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ తప్పనిసరి చేయడంతో పాటు, ఆహార తయారీలో పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. వాడిన వంటనూనెను మళ్లీ ఉపయోగించడంపై కూడా కఠిన ఆంక్షలు విధించారు.

### కల్తీ మాఫియాపై పీడీ యాక్ట్ హెచ్చరిక

కల్తీ ఆహార మాఫియాపై అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ప్రతి రోజు సగటున 15 కల్తీ ఆహార ఫిర్యాదులు అందుతున్నాయని వెల్లడించారు. కల్తీ ఆహారం గురించి సమాచారం ఉంటే వెంటనే డయల్ 100 లేదా వాట్సాప్, ఫోన్ నంబర్ 8712661212కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం హెచ్‌ఫాస్ట్ దాడులు నిరంతరం కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

## వేల ఎకరాల ఫామ్‌హౌజ్‌లు

# ఎలా వచ్చాయ్?

- బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేసింది
- మిడ్జిల్‌లో నాటిన మొక్క మహావృక్షమైంది
- పేదలకు సేవచేసే భాగ్యం దక్కడం అదృష్టం
- మిడ్జిల్ కృతజ్ఞతా సభలో సీఎం రేవంత్ రెడ్డి



మిడ్జిల్ మండల ప్రజలు 2006లో నాటిన మొక్క నేడు మహావృక్షంగా మారి ప్రజలకు సేవ చేసే స్థాయికి తీసుకొచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తన రాజకీయ జీవితానికి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్‌లో నిర్వహించిన రాజకీయ కృతజ్ఞత సభలో ఆయన మాట్లాడారు. ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కడం తన అదృష్టమని, తన రాజకీయ ప్రయాణానికి బలంగా నిలిచిన మిడ్జిల్ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పారు.

### పాలమూరు నుంచి ఎందరో మహానుభావులు

పాలమూరు జిల్లా గొప్ప నాయకులను దేశానికి అందించిందని సీఎం గుర్తు చేశారు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి వంటి మహానుభావులు ఈ నేల నుంచే ఎదిగారని అన్నారు. పాలమూరు బిడ్డలు దేశాన్ని నడిపే సత్తా కలిగిన వారని, పాలనలో తమ ముద్ర వేయగలరని వ్యాఖ్యానించారు.

### పాలమూరు బిడ్డలు పార పట్టగలరు.. పాలన చేయగలరు

2006లో జెడ్పీటీసీగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన తనను మిడ్జిల్ ప్రజలు అక్కున చేర్చుకున్నారని రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. ఈ నియోజకవర్గానికి చెందిన వ్యక్తి కాకపోయినా ప్రజలు తనపై నమ్మకం ఉంచి గెలిపించారని చెప్పారు. అదే విశ్వాసం తనను నేటి స్థాయికి తీసుకొచ్చిందని అన్నారు.

### మిడ్జిల్ నన్ను భుజానికెత్తుకుని ఆదరించింది

తన రాజకీయ జీవితంలో మిడ్జిల్‌కు ప్రత్యేక స్థానం ఉందని సీఎం చెప్పారు. ఒకప్పుడు డార్క్ మండలంగా పేరున్న ఈ ప్రాంత అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజల ప్రేమ, ఆదరణను ఎప్పటికీ మరవనని స్పష్టం చేశారు.

### మిడ్జిల్ మండల అభివృద్ధి బాధ్యత భట్టిదే

మిడ్జిల్ మండలాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దత్తత తీసుకోవాలని సభ వేదికగా సీఎం కోరారు. ఈ ప్రాంత అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టి ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.

### రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారు

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని తీవ్ర అప్పుల్లోకి నెట్టిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. రూ.70 వేల కోట్ల అప్పు ఉన్న రాష్ట్రాన్ని రూ.8.50 లక్షల కోట్ల అప్పుల స్థాయికి తీసుకెళ్లారని విమర్శించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, మూడు ఎకరాల భూమి, కోటి ఎకరాలకు సాగునీరు, ఇంటికో ఉద్యోగం వంటి హామీలను అమలు చేయలేదని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కలను తమ ప్రభుత్వం నెరవేరుస్తోందని చెప్పారు.

### ఆ కుటుంబాలకు వేల ఎకరాల ఫామ్‌హౌజ్‌లు ఎలా వచ్చాయి?

కేసీఆర్ కుటుంబ ఆస్తులపై సీఎం తీవ్ర ప్రశ్నలు లేవనెత్తారు. గజ్వేల్‌లో వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఎలా వచ్చిందని ప్రశ్నించారు. కేటీఆర్, కవిత, హరీశ్‌రావుకు వేల కోట్ల విలువైన భూములు, ఫామ్‌హౌజ్‌లు ఎలా వచ్చాయని నిలదీశారు. పదేళ్ల పాలనలో కుటుంబ సభ్యులకు తప్ప ప్రజలకు ఏమి దక్కలేదని ఆరోపించారు.

### కులగణనతో దేశానికి దిక్సూచి

వందేళ్ల తర్వాత తెలంగాణలో కులగణన నిర్వహించి దేశానికే దిక్సూచిగా నిలిచామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దొరల అహంకారాన్ని ప్రజలు మరోసారి తిరస్కరించాలని పిలుపునిచ్చారు. పేదల సమస్యలు తెలిసిన ప్రభుత్వం మాత్రమే ప్రజలకు న్యాయం చేయగలదని అన్నారు. ప్రతి గ్రామంలోని సమస్యలను పరిష్కరించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, మిడ్జిల్ డార్క్ మండలం కాదు.. అభివృద్ధికి వెలుగురేఖగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎంపీ మల్లు రవి, జితేందర్ రెడ్డి సహా పలువురు నాయకులు పాల్గొన్నారు.



# ఎంపీ సీఎంతో తెలంగాణ సీఎస్

- ఫొటోతో మొదలైన రాజకీయ చర్చ
- సీఎస్ సంజయ్ జాజు ప్రకటనపై రచ్చ

తెలంగాణ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నియామకాన్ని పురస్కరించుకుని మధ్యప్రదేశ్‌లోని ఓ దినపత్రికలో శుభాకాంక్షల ప్రకటన ఇప్పుడు సంచలనంగా మారింది. సాధారణ అభినందన ప్రకటనగా కనిపించిన ఈ ప్రకటన ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దీనికి కారణం ప్రకటనలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్‌తో సంజయ్ జాజు కలిసి ఉన్న ఫొటో ప్రచురించడమే.

### బీజేపీ సీఎం కావడం వల్లే చర్చ!

ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం, మధ్యప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ఈ ఫొటోపై రాజకీయ చర్చ మొదలైంది. ప్రతిపక్ష వర్గాలు ఈ ఫొటోను రాజకీయ సంకేతంగా అభివర్ణిస్తూ అధికార వర్గాలతో సాన్నిహిత్యాన్ని సూచిస్తోందని వ్యాఖ్యానిస్తున్నాయి. మరోవైపు ఇది కేవలం శుభాకాంక్షల ప్రకటన మాత్రమేనని, ఇందులో రాజకీయ ఉద్దేశం లేదని మరికొందరు అభిప్రాయపడుతున్నారు.




### 1992 బ్యాచ్ ఐఏఎస్‌గా సుదీర్ఘ అనుభవం

1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు జూన్ 26న తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఆయన కుటుంబం ప్రస్తుతం భోపాల్‌లో నివసిస్తోంది. రాష్ట్ర అత్యున్నత పరిపాలనా పదవిని చేపట్టిన సందర్భంగా కుటుంబ సభ్యులు స్థానిక పత్రికలో అభినందన ప్రకటన ఇచ్చారు. ప్రకటనలో ప్రచురించిన ఫొటో ఏ ప్రభుత్వ కార్యక్రమానికి సంబంధించినదో వివరాలు వెల్లడించలేదు. పత్రికలో వచ్చిన శుభాకాంక్షల ప్రకటన ఇప్పుడు రాజకీయ చర్చకు దారితీసింది. ప్రస్తుతం ఈ ప్రకటన తెలంగాణ, మధ్యప్రదేశ్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలోనూ ఈ ఫొటోపై అనుకూల, ప్రతికూల వ్యాఖ్యలు కొనసాగుతున్నాయి.

# కాకి లెక్కలు

## భట్టి విక్రమార్క గోబెల్స్ ప్రచారం

## అప్పుల లెక్కలపై హరీశ్ ఫైర్

రాష్ట్ర ప్రభుత్వ అప్పుల విషయంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తప్పుడు లెక్కలు చెబుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్ర అప్పులపై ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవాలను వక్రీకరిస్తోందని మండిపడ్డారు.

### రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారవు

బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు రూ.5.16 లక్షల కోట్లు అని భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రూ.15 వేల కోట్ల అప్పును కూడా బీఆర్ఎస్ ఖాతాలో చూపుతున్నారని ఆరోపించారు. రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారవని, వాస్తవాలు అలాగే ఉంటాయని వ్యాఖ్యానించారు.

### బీఆర్ఎస్ దిగిపోయేనాటికి అప్పు రూ.4.14 లక్షల కోట్లే

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో నుంచి దిగిపోయే సమయానికి రాష్ట్రంపై ఉన్న మొత్తం అప్పు రూ.4.14 లక్షల కోట్లు మాత్రమేనని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న లెక్కలు వాస్తవాలకు విరుద్ధమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల అమలుకు ఎప్పుడూ నిధుల కొరత కారణంగా అడ్డంకులు రాలేదని పేర్కొన్నారు.

### కేసీఆర్ హయాంలో సంక్షేమ పథకాలకు ఆటంకం లేదు

ల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి సంక్షేమ పథకాలను



గత ప్రభుత్వం నిరంతరాయంగా అమలు చేసిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. నిధులు లేవనే కారణంతో ఒక్క పథకాన్నీ నిలిపివేయలేదని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వెనుకడుగు వేయలేదని చెప్పారు.

### కాంగ్రెస్ హామీల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నం

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చిందని, గ్యారంటీ కార్డులు పంపిణీ చేసి ప్రజల మద్దతు పొందిందని హరీశ్‌రావు అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను అమలు చేయలేక ఇప్పుడు రాష్ట్ర అప్పుల పేరుతో కొత్త కథలు చెబుతోందని విమర్శించారు. ప్రభుత్వం ఎదుర్కొంటున్న వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈ ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో లేని అప్పులను ఉన్నట్టుగా చూపిస్తూ కాంగ్రెస్ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు.

# జాగోరే జాగో

- హిందువులపై రేవంత్ సర్కార్ కుట్ర
- మజ్లిస్‌తో కమ్మక్కై ఓట్ల తొలగించే పన్నాగం
- అదే జరిగితే తెలంగాణలో మైనార్టీలవుతాం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ హాట్ కామెంట్స్



రాష్ట్ర ప్రభుత్వం "సర్" ప్రక్రియను ఉపయోగించుకుని హిందువుల ఓట్లను తొలగించే కుట్ర చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పూర్తిస్థాయిలో పనిచేసే పరిస్థితి లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. తెలంగాణ హిందువులంతా అప్రమత్తంగా ఉండాలని, లేదంటే రాష్ట్రంలో హిందువులే మైనారిటీలయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

### హిందువుల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోంది

మజ్లిస్‌తో కుమ్మక్కై కాంగ్రెస్ హిందువుల ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తోందని బండి సంజయ్ విమర్శించారు. ఓటరు జాబితా ప్రక్రియ పారదర్శకంగా జరగడం లేదని, దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధి మొత్తం కేంద్ర నిధుల ద్వారానే జరుగుతోందని బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలకు ఉపయోగపడే పనుల కంటే అప్పులు, అవినీతి, అక్రమాలకే ప్రాధాన్యం ఇచ్చాయని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్లలో రూ.8.21 లక్షల కోట్ల అప్పు, కాంగ్రెస్ రెండున్నరేళ్లలో రూ.1.77 లక్షల కోట్ల అప్పు చేసిందని పేర్కొన్నారు. మొత్తం రూ.10 లక్షల కోట్ల అప్పుతో రాష్ట్ర ప్రజలపై భారీ భారం పడిందన్నారు. జీతాలు, పెన్షన్లు, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు.

### తెలంగాణను శ్రీలంక, పాకిస్తాన్‌లా మార్చే ప్రమాదం


అధిక అప్పులతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రమాదకరంగా మారుతోందన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం ఇచ్చిన 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులను ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారని విమర్శించారు. అప్పుల ఊబి నుంచి బయటపడాలంటే డబుల్ ఇంజన్ ప్రభుత్వం రావాల్సిందేనని అన్నారు. ఉపాధి హామీ పథకానికి వీబీజీ రామ్ జీ పేరు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ కోర్టుకు వెళ్లడం ఎందుకని బండి సంజయ్ ప్రశ్నించారు. పనిదినాలు పెంచి గ్రామాల్లో ఆస్తులు సృష్టించడం తప్పా అని నిలదీశారు. మోదీకి మంచి పేరు వస్తే తట్టుకోలేకే ఇలాంటి చర్యలు తీసుకుంటున్నారని ఆరోపించారు.

### కేంద్ర నిధులతోనే తెలంగాణలో అభివృద్ధి

జగిత్యాల జిల్లా వేములవాడ నియోజకవర్గంలోని మేడిపల్లి, భీమారం, కథలాపూర్ మండలాల్లో పలు అభివృద్ధి పనులను బండి సంజయ్ ప్రారంభించారు. సీసీ రోడ్లు, డ్రైన్లు, బస్టాండ్ నిర్మాణాలు, శంకుస్థాపనలు చేపట్టారు. జగిత్యాల జిల్లా వేములవాడలోని మేడిపల్లి, భీమారం, కథలాపూర్ మండలాల్లో పలు అభివృద్ధి పనులను బండి సంజయ్ ప్రారంభించారు. తాను ఎంపీగా ఉన్న ఏడేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధికి రూ.22 వేల కోట్లకు పైగా కేంద్ర నిధులు తీసుకొచ్చామని చెప్పారు. అందులో రూ.10 వేల కోట్లకుపైగా రోడ్ల నిర్మాణానికే ఖర్చు చేశామని వివరించారు.

# అతి వేగం, నిర్లక్ష్యమే కారణం

- గంటకు 20 ప్రాణాలు బలి
- రోడ్లపై పెరుగుతున్న మరణాలు



దేశంలో రోడ్డు ప్రమాదాలు రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతున్నాయి. అతివేగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా ప్రతి గంటకు సగటున 20 మంది ప్రాణాలు కోల్పోతున్నట్లు తాజా గణాంకాలు చెబుతున్నాయి. 2024లో దేశవ్యాప్తంగా 4.8 లక్షలకు పైగా రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా కూడా రోడ్డు ప్రమాదాలు అకాల మరణాలు, శాశ్వత వికలాంగత్వానికి ప్రధాన కారణంగా మారాయని నివేదికలు వెల్లడిస్తున్నాయి.

### ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆందోళన

ప్రపంచ ఆరోగ్య సంస్థ... డబ్ల్యూహెచ్ఓ గణాంకాల ప్రకారం ప్రతి ఏడాది ప్రపంచవ్యాప్తంగా సుమారు 11.9 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. మరో 5 కోట్ల మంది తీవ్ర గాయాలకు గురవుతున్నారు. ముఖ్యంగా 5 నుంచి 29 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలు, యువత మరణాలకు రోడ్డు ప్రమాదాలే ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. పాదచారులు, సైకిల్ ప్రయాణికులు, ద్విచక్రవాహనదారులే ప్రమాదాల్లో అధికంగా బలవుతున్నారని నివేదిక వెల్లడించింది.

### వేగం పెరిగితే ప్రమాదం తప్పదు

వాహనాల సగటు వేగం పెరగడం ప్రమాదాల తీవ్రతను నేరుగా ప్రభావితం చేస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సగటు వేగం కేవలం 1 శాతం పెరిగినా, ప్రాణాంతక ప్రమాదాల ముప్పు 4 శాతం, తీవ్రమైన ప్రమాదాల ప్రమాదం 3 శాతం పెరుగుతుందని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. క్షణిక నిర్లక్ష్యం ప్రాణాలు తీస్తోందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

### ఢిల్లీలోనూ ఆందోళనకర పరిస్థితి

దేశ రాజధాని ఢిల్లీలో ప్రతి ఏడాది సగటున 5,657 రోడ్డు ప్రమాదాలు నమోదవుతున్నాయి. వీటిలో సుమారు 1,551 మంది మరణిస్తున్నారు. ప్రతి నెలా 471 ప్రమాదాలు, 129 మరణాలు, ప్రతి రోజూ సగటున 16 ప్రమాదాలు, నాలుగు మరణాలు నమోదవుతున్నాయని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

### ఉల్లంఘనలపై కఠిన చర్యలు

2026 తొలి ఆరు నెలల్లో ఢిల్లీ పోలీసులు ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై భారీ స్థాయిలో చర్యలు చేపట్టారు. జూన్ 25 వరకు 3,42,381 చలాన్లు జారీ చేయగా, ఇది గత ఏడాదితో పోలిస్తే 98 శాతం ఎక్కువ. రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించి 397 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. అనధికార పార్కింగ్‌పై 10,62,350 చలాన్లు విధించారు. రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌కు సంబంధించిన చలాన్లు 189 శాతం పెరిగినట్లు పోలీసులు వెల్లడించారు.

### అప్రమత్తతే శ్రీరామరక్ష

రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం అత్యంత అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. అతివేగం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, నిర్లక్ష్యంగా వాహనం నడపడం, అనధికార పార్కింగ్ వంటి చర్యలే ఎక్కువ ప్రమాదాలకు కారణమవుతున్నాయని హెచ్చరిస్తున్నారు. ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం, పరిమిత వేగంతో ప్రయాణించడం, రహదారిపై బాధ్యతగా వ్యవహరించడం ద్వారా వేలాది ప్రాణాలను కాపాడవచ్చని అధికారులు చెబుతున్నారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేస్తున్నారు.




ఉదయం నిద్రలేవగానే ఒక గ్లాస్ పాలు... మధ్యాహ్నం అన్నంలో కూర... సాయంత్రం పిల్లలకు బిస్కెట్లు... రాత్రి బయట హోటల్‌లో భోజనం. ఇవన్నీ మన రోజువారీ జీవితంలో సాధారణ దృశ్యాలే. కానీ ఆ పళ్లెంలో కనిపించేది ఆహారమా? లేక నెమ్మదిగా శరీరాన్ని దెబ్బతీసే విషమా? ఊహించని ఈ ప్రశ్న ఇప్పుడు హైదరాబాద్‌ను కలవరపెడుతోంది. ఎక్కువ లాభాల కోసం కొందరు వ్యాపారులు కల్తీని వ్యాపారంగా మార్చి ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారు. రసాయనాలతో మగ్గించిన పండ్లు, నాసిరకం నూనెలు, నకిలీ పాల ఉత్పత్తులు, కల్తీ మసాలాలు, నాణ్యత లేని ఆహార పదార్థాలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. ఈ దందా ఎంత లోతుగా పాతుకుపోయిందో హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ (హెచ్-ఫాస్ట్) వంద రోజుల దాడులు బయటపెట్టాయి. ప్రతి స్వాధీనం వెనుక వేల కుటుంబాల ఆరోగ్యం దాగి ఉంది. ప్రతి ముద్ద తినే ముందు ఒక్కసారి ఆలోచించాల్సిన పరిస్థితి వచ్చిందంటే... ఇది సాధారణ సమస్య కాదు, ప్రతి ఇంటి గడపను తట్టిన ప్రమాద ఘంటిక.

# ఫుడ్డా.. విషమా..?

## అర్ధమవుతోందా.. రాజా నీకు..

- **హైదరాబాద్‌ను కుదిపేస్తున్న ఆహార కల్తీ మాఫియా**
- **ఫుడ్ అడల్ట్రేషన్ కు చిరునామాగా మారుతున్న మన భాగ్యనగరం**

గాలి తర్వాత మనిషి జీవితానికి అత్యంత అవసరమైన ఆహారమే ఇప్పుడు అతి పెద్ద ఆందోళనగా మారుతోంది. ప్రతి రోజు వాడే పాలు, పెరుగు, నెయ్యి, మసాలాలు, పండ్లు, అల్లంవెల్లుల్లి పేస్ట్, పనీర్, హోటల్ వంటకాలు వంటి అనేక ఆహార పదార్థాల్లో కల్తీ బయటపడుతోంది. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందాలనే ఆశ ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతోంది. రసాయనాలతో తయారైన లేదా నాసిరకం పదార్థాలతో కలిపిన ఆహారం దీర్ఘకాలంలో క్యాన్సర్, గుండె, కాలేయం, మూత్రపిండాల వ్యాధులతో పాటు చిన్నారుల ఎదుగుదలపై కూడా తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ఈ ముప్పును అరికట్టేందుకు హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ (హెచ్‌ఫాస్ట్) చేపట్టిన దాడుల్లో భారీ స్థాయిలో కల్తీ ఆహార పదార్థాలు స్వాధీనం కావడం పరిస్థితి తీవ్రతను వెల్లడించింది. ఆహార భద్రత ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు. నాణ్యమైన ఉత్పత్తులను ఎంపిక చేసుకోవడం, అనుమానాస్పద వస్తువులపై ఫిర్యాదు చేయడం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ప్రతి పౌరుడు ఈ పోరాటంలో భాగస్వామి కావాల్సిన అవసరం ఉంది.

**• ఎక్కడ చూసినా కల్తీ ఆనవాళ్లు.. వంద రోజుల్లోనే సంచలన ఫలితాలు**

ఈ ఏడాది మార్చి 19న హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ (హెచ్‌ఫాస్ట్) ఏర్పాటైంది. ప్రజారోగ్యాన్ని కాపాడటమే లక్ష్యంగా నగర పోలీసులతో పాటు జీహెచ్ఎంసీ, ఫుడ్ సేఫ్టీ, వెటర్నరీ శాఖలు కలిసి ఈ ప్రత్యేక వ్యవస్థను ప్రారంభించాయి. కేవలం వంద రోజుల వ్యవధిలోనే నగరవ్యాప్తంగా 185 కేసులు నమోదు కావడం పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో చెబుతోంది. ఈ దాడుల్లో సుమారు 121.87 టన్నుల ప్రమాదకరమైన కల్తీ ఆహార పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఒక్క నగరంలోనే ఇంత భారీ స్థాయిలో కల్తీ పదార్థాలు బయటపడటం ప్రజలను కలవరపెడుతోంది. ప్రతి దాడి వెనుక ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలనే సంకల్పం కనిపిస్తోంది.
హెచ్‌ఫాస్ట్ నమోదు చేసిన కేసులను పరిశీలిస్తే కల్తీ ఒకే వస్తువుకే పరిమితం కాలేదని స్పష్టమవుతోంది. అల్లం వెల్లుల్లి పేస్ట్‌లో నాణ్యత లేని పదార్థాలు కలిపి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. పండ్లను సహజంగా పండించకుండా ప్రమాదకర రసాయనాలతో మగ్గబెట్టి మార్కెట్‌లోకి పంపుతున్న ముఠాలను పట్టుకున్నారు. నిల్వ పచ్చళ్లు, కోవా, టీ పొడి, క్రీమ్, నెయ్యి, పెరుగు, పనీర్, డ్రై ఫ్రూట్స్, ఖర్జూరం, చికెన్, మాంసం, ఫ్రైడ్ చికెన్ వంటి అనేక వస్తువుల్లో కల్తీ బయటపడింది. ఐస్ క్రీమ్, బిస్కెట్లు, వాటర్ ప్లాంట్లు, జంక్ ఫుడ్ తయారీ కేంద్రాలపై కూడా కేసులు నమోదయ్యాయి. ప్రజలు ప్రతిరోజూ వాడే వస్తువులే ఎక్కువగా కల్తీకి గురవుతున్నాయనే విషయం ఆందోళన కలిగిస్తోంది.

**• భయపెడుతున్న నిజాలు.. ఆరోగ్యంపై దాడి**

స్వాధీనం చేసిన పదార్థాల పరిమాణం చూస్తే పరిస్థితి ఎంత ప్రమాదకరమో అర్థమవుతుంది. 27 కేసుల్లో 27 వేల కిలోలకు పైగా నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ పట్టుబడింది. 16 కేసుల్లో దాదాపు 26 వేల కిలోల రసాయనాలతో మగ్గించిన పండ్లు స్వాధీనం అయ్యాయి. చికెన్ వ్యర్థాలకు సంబంధించిన కేసుల్లో 60 టన్నులకుపైగా పదార్థాలు బయటపడ్డాయి. వేల కిలోల కోవా, టీ పొడి, పనీర్, పెరుగు, క్రీమ్, నెయ్యి కూడా అధికారులు పట్టుకున్నారు. ఇవన్నీ ఇప్పటికే మార్కెట్‌లోకి చేరి ప్రజల ఇళ్లలోకి వెళ్లి ఉంటే ఎంత పెద్ద ఆరోగ్య విపత్తు జరిగేదో ఊహించుకోవచ్చు. ప్రతి స్వాధీనం వెనుక వేలాది కుటుంబాల ఆరోగ్యం దాగి ఉంది. కల్తీ ఆహారం తిన్న వెంటనే ప్రతి ఒక్కరికీ అనారోగ్యం రావాల్సిన అవసరం లేదు. అదే దీని ప్రమాదం. కొద్దికొద్దిగా శరీరంలోకి వెళ్లే హానికర రసాయనాలు కాలక్రమంలో తీవ్రమైన సమస్యలకు కారణమవుతాయి. మూత్రపిండాల వ్యాధులు, కాలేయ సమస్యలు, గుండె సంబంధిత ఇబ్బందులు, క్యాన్సర్ వంటి జబ్బులకు ఇవి దారి తీసే అవకాశం ఉందని వైద్య నిపుణులు తరచూ హెచ్చరిస్తున్నారు. చిన్నారుల ఎదుగుదలపై కూడా దీని ప్రభావం ఉంటుంది. శారీరక బలహీనతతో పాటు మానసిక అభివృద్ధి కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది. ఒక కుటుంబంలో ఒక్కరికి తీవ్రమైన అనారోగ్యం వచ్చినా ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి కుదేలవుతుంది. అందుకే కల్తీ సమస్యను చిన్న విషయంగా తీసుకోవడం ప్రమాదకరం.

**• వందల కేసులు విచారణలో.. వ్యాపారులకు కఠిన హెచ్చరికలు**

పోలీసులు నమోదు చేసిన కేసులతో కథ ముగియలేదు. తదుపరి చర్యల కోసం మరో 247 కేసులను జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులకు బదిలీ చేశారు. పనీర్ విక్రయ కేంద్రాలు, సమోసా తయారీ కేంద్రాలు, వాటర్ ప్యాకింగ్ ప్లాంట్లు, మసాలా తయారీ కేంద్రాలు, బేకరీలు, ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు, హాస్టళ్లు, మాంసం దుకాణాలు, ఐస్ తయారీ కేంద్రాలపై పెద్ద ఎత్తున విచారణ కొనసాగుతోంది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా కూడా అనేక కేసులు నమోదు కావడం గమనార్హం. ప్రజల అప్రమత్తత కూడా అధికారులకు బలంగా మారుతోంది. హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, ఆహార తయారీ కేంద్రాల యజమానులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి అధికారులు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ కలిగి ఉండాలని చెప్పారు. నిల్వ పదార్థాలను సరైన పద్ధతిలో వినియోగించాలని, పాత నిల్వలను కొత్త నిల్వలతో కలపవద్దని సూచించారు. వంట నూనెను పదేపదే వాడొద్దని హెచ్చరించారు. పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేసే వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

**• మన చేతిలోనే మన ఆరోగ్యం.. సామాన్యుడేం చేయాలి**

కల్తీని పూర్తిగా అరికట్టడం ప్రభుత్వ యంత్రాంగం ఒక్కదాని వల్ల సాధ్యం కాదు. ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉండాలి. అనుమానాస్పద ఆహార పదార్థాలు కనిపించినా, అపరిశుభ్ర వాతావరణంలో తయారీ జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీసులు స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రతి రోజూ సగటున పదిహేను వరకు సమాచారం ప్రజల నుంచి అందుతోందని అధికారులు వెల్లడించారు. ఈ స్పందన మరింత పెరిగితే కల్తీ ముఠాలను వేగంగా గుర్తించడం సాధ్యమవుతుంది. చాలా తక్కువ ధరకు వస్తోందని తెలియని బ్రాండ్ల ఆహార పదార్థాలు కొనుగోలు చేయడం మంచిది కాదు. ప్యాకెట్‌పై తయారీ తేదీ, గడువు తేదీ, నాణ్యత గుర్తులు తప్పనిసరిగా పరిశీలించాలి. పాలు, నెయ్యి, మసాలాలు, పనీర్, పెరుగు వంటి పదార్థాలను విశ్వసనీయ దుకాణాల నుంచే కొనాలి. రోడ్డుపక్కన అపరిశుభ్రంగా తయారైన ఆహారం తీసుకోవడం తగ్గించాలి. పిల్లలకు ఇచ్చే ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. వాసన, రంగు, రుచి అసహజంగా అనిపిస్తే వెంటనే వినియోగం ఆపాలి. ఆరోగ్యంపై చిన్న నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదానికి దారి తీస్తుందని గుర్తుంచుకోవాలి.




**• కల్తీపై పోరాటం నిరంతరం.. ఆరోగ్యాన్ని కాపాడేది అప్రమత్తతే**

ఆహార కల్తీ అనేది ఒక్క ప్రభుత్వ సమస్య కాదు. ప్రతి కుటుంబాన్ని, ప్రతి చిన్నారిని, ప్రతి పౌరుడిని ప్రభావితం చేసే సామాజిక ముప్పు. కల్తీ పదార్థాలు తయారు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం ఎంత అవసరమో, అలాంటి దందాలను గుర్తించి అధికారులకు సమాచారం ఇవ్వడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. హెచ్‌ఫాస్ట్ వంద రోజుల చర్యలు కల్తీ ముఠాలకు గట్టి హెచ్చరికగా నిలిచాయి. అయినా ఈ పోరాటం ఇక్కడితో ముగియదు. నాణ్యమైన ఆహారాన్ని విక్రయించే వ్యాపారులకు ప్రోత్సాహం లభించాలి. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టం మరింత కఠినంగా అమలుకావాలి. వినియోగదారులు కూడా కొనుగోలు చేసే ప్రతి ఆహార పదార్థాన్ని జాగ్రత్తగా పరిశీలించే అలవాటు పెంచుకోవాలి. ఆరోగ్యం కోల్పోయిన తర్వాత పశ్చాత్తాపపడటం కంటే ముందుగానే అప్రమత్తంగా ఉండటం ఎంతో మేలు. స్వచ్ఛమైన ఆహారం ప్రతి ఒక్కరి హక్కు. ఆ హక్కును కాపాడే బాధ్యత ప్రభుత్వం, వ్యాపారులు, ప్రజలు అందరిదీ. కల్తీ లేని ఆహారం అందరికీ చేరినప్పుడే ఆరోగ్యవంతమైన హైదరాబాద్, ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుంది.









## జోన్ల వారీగా దాడులు.. విస్తుపోయే నిజాలు

కల్తీ వల్ల కలిగే నష్టం కేవలం వ్యక్తిగత ఆరోగ్యానికే పరిమితం కాదు. అనారోగ్యంతో చికిత్స ఖర్చులు పెరుగుతాయి. ఉద్యోగాలు చేసే వారి పనితీరు తగ్గుతుంది. విద్యార్థుల చదువుపై ప్రభావం పడుతుంది. ఉత్పాదకత తగ్గిపోతుంది. ఒక సమాజం ఆరోగ్యంగా ఉంటేనే ఆర్థికంగా ముందుకు సాగుతుంది. కల్తీ కారణంగా లక్షలాది మంది అనారోగ్యానికి గురైతే దేశ అభివృద్ధిపైనా ప్రభావం పడుతుంది. అందుకే ఆహార భద్రతను ప్రభుత్వం అత్యంత కీలక అంశంగా పరిగణిస్తోంది. పరిశుభ్రమైన ఆహారం ప్రతి పౌరుడి హక్కు అనే భావన ఇప్పుడు మరింత బలపడుతోంది. హైదరాబాద్‌లోని వివిధ జోన్లలో హెచ్‌ఫాస్ట్ విస్తృత తనిఖీలు చేపట్టింది. అత్యధికంగా రాజేంద్రనగర్ జోన్‌లో 55 కేసులు నమోదయ్యాయి. గోల్కొండలో 44, సికింద్రాబాద్‌లో 35, చార్మినార్‌లో 21, శంషాబాద్‌లో 13, జూబ్లీహిల్స్‌లో 12, ఖైరతాబాద్‌లో 5 కేసులు వెలుగులోకి వచ్చాయి. ఈ సంఖ్యలు నగరంలోని ఏ ప్రాంతమూ కల్తీ సమస్యకు అతీతం కాదని సూచిస్తున్నాయి. నగరమంతా నిరంతర నిఘా అవసరమనే విషయాన్ని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

## ప్రమాద ఘంటికలు: కల్తీ ఆహారం... కనిపించని ముప్పు

- 121.87 టన్నులు – వంద రోజుల్లో హెచ్‌ఫాస్ట్ స్వాధీనం చేసుకున్న కల్తీ ఆహార పదార్థాలు.
- 185 కేసులు – హైదరాబాద్‌లో నమోదైన ఆహార కల్తీ కేసులు.
- ప్రతి ఇంటికీ ముప్పు – పాలు, నెయ్యి, పెరుగు, పనీర్, పండ్లు, మసాలాలు, అల్లంవెల్లుల్లి పేస్ట్ వంటి నిత్యావసరాల్లోనే కల్తీ గుర్తింపు.
- రసాయనాలతో పండించిన పండ్లు – ఆరోగ్యానికి హానికరమైన రసాయనాలతో మగ్గించి మార్కెట్‌లో విక్రయం.
- నాసిరకం నూనెలు – పదేపదే వాడిన వంటనూనెతో హోటళ్లలో ఆహారం తయారీ.
- దీర్ఘకాలిక ప్రమాదం – కల్తీ ఆహారం వల్ల క్యాన్సర్, కాలేయం, మూత్రపిండాలు, గుండె సంబంధిత వ్యాధుల ముప్పు పెరిగే అవకాశం.
- పిల్లలపై తీవ్ర ప్రభావం – శారీరక ఎదుగుదల, మానసిక వికాసంపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం.
- సామాన్యులు చేయాల్సింది – తక్కువ ధరకు లభించే అనుమానాస్పద ఉత్పత్తులు కొనొద్దు. తయారీ తేదీ, గడువు తేదీ, నాణ్యత గుర్తులు తప్పనిసరిగా పరిశీలించాలి.
- అప్రమత్తతే రక్షణ – అనుమానాస్పద ఆహారం కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వడం ప్రతి పౌరుడి బాధ్యత.

**- మీలో ఒకడు ..**

# ప్రాణాలతో చెలగాటం..!

## ప్రేమకు హద్దు ఎక్కడ?




**ఒకప్పుడు ప్రేమ అంటే జీవితాంతం నిలిచే అనుబంధంగా భావించేవారు. వివాహం అంటే ఇద్దరు వ్యక్తుల కలయిక మాత్రమే కాదు, రెండు కుటుంబాల మధ్య ఏర్పడే విశ్వాస బంధంగా చూసేవారు. మాటకు విలువ ఉండేది. ఇచ్చిన హామీకి గౌరవం ఉండేది. మనసులు కలిసిన తర్వాతే జీవితాన్ని కలిసి నడవాలని పెద్దలు చెప్పేవారు. కాలం మారింది. జీవనశైలి మారింది. సాంకేతికత మనిషి జీవితాన్ని వేగవంతం చేసింది. ప్రపంచం అరచేతిలోకి వచ్చింది. కానీ ఈ మార్పుల మధ్య కొన్ని విలువలు నెమ్మదిగా బలహీనపడిపోయాయ్. నిజాయితీ, నమ్మకం, బాధ్యత, పరస్పర గౌరవం... తగ్గి బంధాలు బలహీనపడ్డాయ్. ఈ పరిస్థితి కేవలం ఒక్క కుటుంబానికి పరిమితం కాదు. సమాజం మొత్తం ఆలోచించాల్సిన అంశంగా మారింది.**

### • శృంగారం అంటే శరీరాలు మాత్రమే కావు..

ప్రేమ అంటే కేవలం ఆకర్షణ కాదు. ఒకరిని ఒకరు అర్థం చేసుకోవడం, కష్టసుఖాల్లో తోడుగా నిలవడం, జీవితాన్ని కలిసి నిర్మించుకోవాలనే నిర్ణయం. ప్రేమలో స్వార్థానికి చోటు ఉండదు. ఎదుటివారి ఆనందాన్ని తన ఆనందంగా భావించే భావన ఉంటుంది. ప్రేమలో గౌరవం ఉంటుంది. బాధ్యత ఉంటుంది. విశ్వాసం ఉంటుంది. ఈ మూడు లేకపోతే ప్రేమ అనే పదం మాత్రమే మిగులుతుంది. భావోద్వేగం కొంతకాలం ఉండొచ్చు. కానీ బంధం నిలబడదు. అందుకే ప్రేమను క్షణిక భావోద్వేగంగా కాకుండా జీవితాన్ని ప్రభావితం చేసే నిర్ణయంగా చూడాలి. శృంగారం మానవ జీవితంలో సహజమైన భాగం. దాన్ని తప్పుగా చూడాల్సిన అవసరం లేదు. అదే సమయంలో దాన్ని వినోదంగా, తాత్కాలిక కోరికగా చూడటం కూడా సరైంది కాదు. ఇద్దరి స్పష్టమైన సమ్మతి, పరస్పర గౌరవం, నమ్మకం, బాధ్యత ఉన్నప్పుడు మాత్రమే శృంగారం దాంపత్యాన్ని మరింత బలపరుస్తుంది. మనసులు దూరంగా ఉంటే శరీరాలు దగ్గరైనా ఆ బంధం ఎక్కువకాలం నిలవదు. ప్రేమ హృదయాలను కలుపుతుంది. శృంగారం ఆ బంధాన్ని మరింత బలపరుస్తుంది. ఈ క్రమం మారినప్పుడు సంబంధాల్లో చీలికలు ప్రారంభమవుతాయి.

### • డిజిటల్ యుగం సవాళ్లు.. ప్రేమకు కామానికి తేడా ఇదే

ప్రేమ ఎదుటివారి జీవితాన్ని గౌరవిస్తుంది. కామం తన కోరికను మాత్రమే చూస్తుంది. ప్రేమ త్యాగం చేయగలదు. కామం స్వార్థాన్ని వెతుకుతుంది. ప్రేమ కాలంతో మరింత బలపడుతుంది. కామం కోరిక తీరిన తర్వాత తగ్గిపోతుంది. ఈ రెండింటి మధ్య ఉన్న తేడాను అర్థం చేసుకోలేకపోవడం వల్లే అనేక సంబంధాలు సంక్షోభంలో పడుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. శారీరక ఆకర్షణ సహజమే. కానీ అదే ప్రేమ అనుకోవడం ప్రమాదకరం. అందం మారుతుంది. వయసు మారుతుంది. పరిస్థితులు మారుతాయి. నిజాయితీ మాత్రమే జీవితాంతం నిలుస్తుంది. ఈరోజు పరిచయం కావడానికి ఒక మొబైల్ ఫోన్ చాలు. ఒక సందేశం చాలు. ఒక వీడియో కాల్ చాలు. ప్రపంచంలో ఎక్కడున్న వారితోనైనా క్షణాల్లో మాట్లాడే అవకాశం ఉంది. ఇది గొప్ప మార్పే. అదే సమయంలో సంబంధాల్లో కొత్త సవాళ్లను కూడా తీసుకొచ్చింది. సోషల్ మీడియా ద్వారా ఏర్పడే పరిచయాల్లో నిజాయితీ ఎంత ఉంది? ఆకర్షణ ఎంత ఉంది? అనే ప్రశ్నలు పెరుగుతున్నాయి. వాస్తవ జీవితానికి భిన్నంగా కనిపించే డిజిటల్ ప్రపంచం కొన్నిసార్లు అపార్థాలకు దారితీస్తోంది. అందుకే సాంకేతికతను కాకుండా దాన్ని ఉపయోగించే విధానాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉంది.

### డబుల్ కా మీటా కాదు.. కుటుంబాలను రోడ్డు పడేస్తుంది!

ఒకరిని ప్రేమిస్తున్నామని చెబుతూ మరో వ్యక్తితో వివాహానికి సిద్ధపడటం, ఒక బంధంలో ఉంటూనే మరో బంధాన్ని కొనసాగించడం, నిజాలను దాచిపెట్టడం చివరికి తీవ్ర సమస్యలకు దారి తీస్తుంది. ప్రతి సంబంధం నిలవకపోవచ్చు. అభిప్రాయ భేదాలు రావచ్చు. విడిపోవాల్సిన పరిస్థితి కూడా రావచ్చు. అలాంటి సమయంలో నిజం చెప్పడం, గౌరవంగా నిర్ణయం తీసుకోవడం పరిపక్వతకు నిదర్శనం. అబద్ధంతో ముందుకు సాగడం మాత్రం ఒక్కరినే కాదు, రెండు కుటుంబాలను కూడా గాయపరుస్తుంది. భారతీయ కుటుంబ వ్యవస్థలో వివాహానికి ప్రత్యేక స్థానం ఉంది. అది కేవలం ఒక కార్యక్రమం కాదు. జీవితాం తం కలిసి నడవాలనే వాగ్దానం. సుఖంలోనూ, కష్టంలోనూ ఒకరికి ఒకరు అండగా నిలబడతామని ఇచ్చే మాట. అందుకే వివాహంలో విశ్వాసానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. మనసులో సందేహం ఉంటే, ఇప్పటికే మరో బంధం ఉంటే, వివాహానికి ముందు నిజం చెప్పడం బాధాకరమైన నిర్ణయం కావచ్చు. కానీ అది భవిష్యత్తులో పెద్ద విషాదాన్ని నివారించే ధైర్యమైన నిర్ణయం కూడా అవుతుంది.

### స్వేచ్ఛ, బాధ్యత... డబ్బు ప్రేమకు ప్రత్యామ్నాయం కాదు

ప్రేమను డబ్బుతో కొలవలేం. సంపద ఉన్నంత మాత్రాన సంతోషం కొనలేం. కోట్ల రూపాయల ఆస్తి ఉన్నా నమ్మకం లేకపోతే ఆ సంపదకు విలువ ఉండదు. నిజమైన ప్రేమ ఉంటే పరిమిత వనరులతో కూడా ఆనందంగా జీవించవచ్చు. అందుకే పెద్దలు మనసులు కలవాలని చెప్పేవారు. నేటి కాలంలో లెక్కలు, హోదాలు, ఆస్తులు, ఉద్యోగాలు ముఖ్యమైనవే. కానీ అవి ప్రేమకు ప్రత్యామ్నాయం కావు. బంధాలను నిలబెట్టేది పరస్పర గౌరవం మాత్రమే. నేటి యువతకు జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛ ఉంది. ఇది సమాజంలో వచ్చిన గొప్ప మార్పు. అదే సమయంలో ప్రతి స్వేచ్ఛకు బాధ్యత కూడా ఉంటుంది. ప్రేమించే హక్కు ఉన్నట్లే మోసం చేయకుండా ఉండే బాధ్యత కూడా ఉంది. ఒక బంధాన్ని కొనసాగించలేకపోతే గౌరవంగా ముగించడం కూడా పరిపక్వతే. కోపం, అసూయ, అబద్ధం, స్వార్థం ఏ సంబంధాన్నైనా బలహీనపరుస్తాయి. నిజాయితీ మాత్రం బంధాలను నిలబెడుతుంది.

### • ఉమ్మడి కుటుంబాలెక్కడ? ప్రాణాలతో శృంగారం చెలగాటం..!

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబం పిల్లలకు మొదటి పాఠశాలగా ఉండేది. పెద్దల అనుభవం చిన్నవారికి దారి చూపేది. భార్యాభర్తల మధ్య చిన్నచిన్న అపార్థాలు వచ్చినా పెద్దలు మాట్లాడించి పరిష్కారం చూపేవారు. ఓపిక, సహనం, మాట నిలబెట్టుకోవడం, కుటుంబ గౌరవం వంటి విలువలు ఇంట్లోనే నేర్చుకునేవారు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. ఉద్యోగాల కోసం నగరాలకు వెళ్లడం, విదేశాలకు వెళ్లడం, అణు కుటుంబాలు పెరగడం సహజమైన మార్పులే. కానీ ఈ మార్పుల మధ్య సంభాషణ తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఒకే ఇంట్లో ఉంటూ కూడా మనసులు దూరమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కుటుంబంలో మాట్లాడుకునే సమయం తగ్గినప్పుడు అపార్థాలకు అవకాశం పెరుగుతుంది. బంధాలను కాపాడేది గోడలు కాదు. పరస్పరం మాట్లాడుకునే మనసులే. ఆకర్షణ జీవితాలను పణంగా పెడుతోంది. శృంగార మాయ.. ప్రాణాలను బలిపీఠమెక్కిస్తోంది. వావివరుసలు మరచిపోయేలా చేస్తూ.. జీవితాలను నరక ప్రాయాలుగా మార్చేస్తోంది. జీవితానికి సెక్స్ ఎంత అవసరమో.. అంత కంటే జీవితం ఎక్కువ అవసరమన్నది గమనించలేని దౌర్భాగ్యకర పరిస్థితులు ఇప్పుడు సమాజాన్ని ప్రశ్నిస్తున్నాయి.

### • సోషల్ మీడియా ప్రభావం.. కూర్చొని మాట్లాడుకునే పరిస్థితులేవి?

సోషల్ మీడియా ప్రపంచాన్ని దగ్గర చేసింది. కానీ ప్రతి పరిచయం నిజమైన స్నేహంగా మారదు. ప్రతి నవ్వు నిజమైన ఆనందాన్ని చెప్పదు. ప్రతి ఫోటో వెనుక సంతోషకరమైన జీవితమే ఉంటుందని భావించడం పొరపాటు. చాలామంది తమ జీవితాలను ఇతరుల పోస్టులతో పోల్చుకోవడం ప్రారంభిస్తున్నారు. అసంతృప్తి పెరుగుతోంది. అదే కొత్త పరిచయాల కోసం వెతికే పరిస్థితికి దారితీస్తోంది. సాంకేతికతను తప్పుపట్టాల్సిన అవసరం లేదు. దాన్ని ఎలా ఉపయోగిస్తున్నామన్నదే అసలు విషయం. డిజిటల్ ప్రపంచం ఒక సాధనం మాత్రమే. అది నిజాయితీకి, నమ్మకానికి ప్రత్యామ్నాయం కాదు. ఏ బంధంలోనైనా సమస్యలు రావడం సహజం. అభిప్రాయ భేదాలు కూడా సహజమే. కానీ మాట్లాడుకోవడం ఆగినప్పుడు సమస్యలు పెరుగుతాయి. భార్యాభర్తలు, ప్రేమికులు, కుటుంబ సభ్యులు ఒకరి భావాలను మరొకరు వినాలి. కోపంలో తీసుకున్న నిర్ణయం జీవితాంతం పశ్చాత్తాపానికి కారణం కావచ్చు. ఒక చిన్న అపార్థం పెద్ద దూరంగా మారకముందే మాట్లాడుకోవడం అవసరం. బంధాన్ని కాపాడాలనే ఆలోచన ఉన్న చోట పరిష్కారం దొరుకుతుంది. గెలవాలనే పట్టుదల ఉన్న చోట మాత్రం సంబంధం ఓడిపోతుంది.

### నిజాయితీ లేని ప్రేమ నిలవదు.. శృంగారానికి బాధ్యత అక్కర్లేదా?

ప్రేమలో అబద్ధాలకు స్థానం ఉండకూడదు. ఒక బంధంలో ఉంటూనే మరో బంధాన్ని కొనసాగించడం, నిజాలను దాచిపెట్టడం, ఒకరికి ఒక మాట చెప్పి ఇంకొకరికి మరో మాట చెప్పడం చివరికి అందరికీ నష్టం చేస్తుంది. ఒక సంబంధం కొనసాగించడం సాధ్యం కాకపోతే గౌరవంగా ముగించడం మంచిది. బాధ కలిగినా నిజం చెప్పడం మంచిది. అబద్ధంతో ప్రారంభమైన బంధం ఎంతకాలం కొనసాగినా ఒకరోజు కూలిపోతుంది. విశ్వాసమే ప్రేమకు శ్వాస. శృంగారం ఇద్దరి జీవితాల్లో సహజమైన భాగమే. కానీ అది పరస్పర సమ్మతి, గౌరవం, బాధ్యతతో ఉండాలి. శారీరక ఆకర్షణ మాత్రమే బంధాన్ని నిలబెట్టదు. మానసిక అనుబంధం లేకపోతే శృంగారం కూడా ఖాళీ అనుభూతిగానే మిగులుతుంది. ఒకరి భావాలను మరొకరు గౌరవించాలి. ఒకరి జీవితంపై మరొకరికి బాధ్యత ఉండాలి. అప్పుడే దాంపత్యం ఆనందంగా ఉంటుంది. శరీరాల కలయిక కంటే మనసుల కలయిక గొప్పది.

### • విద్య అంటే మార్కులు మాత్రమే కాదు.. తల్లిదండ్రుల పాత్ర కీలకం

పిల్లలకు మంచి చదువు చెప్పడం తల్లిదండ్రుల బాధ్యత. అదే స్థాయిలో జీవిత విలువలు నేర్పించడం కూడా బాధ్యతే. ప్రేమ అంటే ఏమిటి, వివాహం అంటే ఏమిటి, బాధ్యత అంటే ఏమిటి అనే విషయాలపై కుటుంబంలో స్వేచ్ఛగా మాట్లాడే వాతావరణం ఉండాలి. పిల్లలకు వినే చెవులు కావాలి. అర్థం చేసుకునే పెద్దలు కావాలి. భయంతో కాకుండా నమ్మకంతో తల్లిదండ్రులతో మాట్లాడగలిగితే అనేక సమస్యలు ముందుగానే పరిష్కారం అవుతాయి. సంభాషణ ఉన్న కుటుంబాల్లో అపార్థాలు తక్కువగా ఉంటాయి. పాఠశాలలు, కళాశాలలు ఉద్యోగానికి అవసరమైన జ్ఞానంతో పాటు జీవితానికి అవసరమైన విలువలను కూడా నేర్పాలి. పరస్పర గౌరవం, సమానత్వం, బాధ్యత, భావోద్వేగ పరిపక్వత, ఆరోగ్యకరమైన సంబంధాల విలువ గురించి యువతకు అవగాహన కల్పించాలి. మంచి ఉద్యోగం సంపాదించడం గొప్ప విషయం. మంచి మనిషిగా ఎదగడం అంతకంటే గొప్ప విషయం. విద్య జీవనోపాధిని ఇస్తుంది. విలువలు జీవితానికి దిశ చూపిస్తాయి.

### • స్వేచ్ఛకు కూడా హద్దులు ఉంటాయన్న పాఠం నేర్చుకోవాలి

ఇటీవలి కాలంలో వెలుగులోకి వచ్చిన కొన్ని నేరాలు సమాజాన్ని కలవరపెట్టాయి. ప్రతి కేసు వాస్తవాలను దర్యాప్తు సంస్థలు, న్యాయస్థానాలే నిర్ధారిస్తాయి. కానీ అలాంటి ఘటనలు మనకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తున్నాయి. కోపం, అసూయ, మోసం, ఇంట్లో ఇల్లాలు.. పక్కింట్లో ప్రియురాలు ఆలోచన... చివరికి విధ్వంసానికే దారి తీస్తాయి. ఒక క్షణం తీసుకున్న తప్పు నిర్ణయం కుటుంబాలను జీవితాంతం బాధలోకి నెట్టేస్తుంది. అందుకే భావోద్వేగాల కంటే బాధ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి వ్యక్తికి తన జీవితాన్ని నిర్ణయించుకునే హక్కు ఉంది. ప్రేమించే హక్కు ఉంది. వివాహం చేసుకునే హక్కు ఉంది. అదే సమయంలో ఎదుటివారి జీవితాన్ని గౌరవించే బాధ్యత కూడా ఉంది. మన నిర్ణయం వల్ల మరో వ్యక్తి జీవితం చీకటిలోకి వెళ్లకూడదు. ఒక బంధాన్ని కొనసాగించలేకపోతే స్పష్టంగా చెప్పడం ధైర్యం. అబద్ధంతో ముందుకు సాగడం తెలివి కాదు. నిజం చెప్పడం కొంతకాలం బాధ కలిగించవచ్చు. అబద్ధం మాత్రం జీవితాంతం గాయం చేస్తుంది.

### • ప్రేమకు పరమార్థం ఇదే.. ఒక్క నిర్ణయమే అదే జీవితం

ప్రేమ ఒక వరం. మోసం కాదు. శృంగారం ఒక బాధ్యత. ఆట కాదు. వివాహం ఒక వాగ్దానం. కార్యక్రమం కాదు. క్షణిక ఆకర్షణ కోసం జీవితాంతం నిలిచే బంధాలను పణంగా పెట్టకూడదు. ఒక అబద్ధం రెండు కుటుంబాలను కూల్చగలదు. ఒక మోసం అమాయక జీవితాలను నాశనం చేయగలదు. అదే ఒక నిజాయితీ నిర్ణయం ఎన్నో ప్రాణాలను కాపాడగలదు. ప్రేమకు గౌరవం ఉన్న చోటే విశ్వాసం నిలుస్తుంది. విశ్వాసం ఉన్న చోటే కుటుంబం నిలుస్తుంది. కుటుంబం నిలిచిన చోటే సమాజం సురక్షితంగా ఉంటుంది. ప్రేమకు పరమార్థం పరస్పర గౌరవం. శృంగారానికి పరిమితి బాధ్యత. జీవితానికి పరమ విలువ నమ్మకం. అదే ప్రతి తరం గుర్తుంచుకోవాల్సిన శాశ్వత సత్యం. మనిషి జీవితంలో గొప్ప సంపద డబ్బు కాదు. నమ్మకం. గొప్ప ఆస్తి భూములు కాదు. మంచి పేరు. గొప్ప బంధం శరీరాల కలయిక కాదు. మనసుల కలయిక. ప్రేమ మనిషిని ఉన్నతుడిని చేయాలి. శృంగారం ఇద్దరి జీవితాలను మరింత అందంగా మార్చాలి. వివాహం కొత్త ఆశలకు నాంది కావాలి. విషాదాలకు కారణం కాకూడదు. కాలం మారవచ్చు. జీవనశైలి మారవచ్చు. సాంకేతికత మరింత వేగంగా అభివృద్ధి చెందవచ్చు. కానీ నిజాయితీ, విశ్వాసం, పరస్పర గౌరవం, బాధ్యత అనే విలువలు ఎప్పటికీ మారకూడదు. అవే కుటుంబాన్ని నిలబెడతాయి. కుటుంబం నిలిస్తే సమాజం బలపడుతుంది. సమాజం బలపడితే మానవత్వం నిలుస్తుంది.

**- హుస్సేన్,**




మిస్టరీగా రాధాగాయత్రి కేసు
టెకీ మరణం వెనుక సీక్రెట్ • భార్య మృతిపై భర్త వాదనలు
స్నేహితుల సంచలన ఆరోపణలు

## బెతెల్ మెరుపులు..
# భారత్‌కు షాక్



**తొలి టీ 20 మ్యాచ్‌లో ఇంగ్లండ్ విజయం**

ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టీ20లో భారత్ నాలుగు వికెట్ల తేడాతో ఓటమి చవిచూసింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లండ్ 10 ఆధిక్యం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 190 పరుగులు చేసింది. ఓపెనర్ అభిషేక్ శర్మ 24 బంతుల్లో 43 పరుగులు చేసి శుభారంభం అందించాడు. ఇషాన్ కిషన్ 40 బంతుల్లో 49 పరుగులు చేయగా, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 22 బంతుల్లో 37 పరుగులు చేశాడు. అంతర్జాతీయ అరంగేట్రం చేసిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ 10 బంతుల్లో 14 పరుగులు చేసి అవుటయ్యాడు. 191 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ 19 ఓవర్లలోనే ఆరు వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. జాకబ్ బెతెల్ 46 బంతుల్లో అజేయంగా 76 పరుగులు చేసి జట్టును గెలిపించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో సామ్ కరన్ మూడు వికెట్లు తీసి భారత్‌ను కట్టడి చేశాడు. దీంతో సిరీస్‌లో ఇంగ్లండ్ తొలి ఆధిక్యాన్ని దక్కించుకుంది.

## అక్షర్ పటేల్ చరిత్ర.. టీ20ల్లో 100 వికెట్ల ఘనత



మాంచెస్టర్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టీ20లో భారత ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ అరుదైన ఘనత సాధించాడు. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 100 వికెట్లు తీసిన తొలి భారత స్పిన్నర్‌గా చరిత్ర సృష్టించాడు. హ్యారీ బ్రూక్‌ను ఔట్ చేయడం ద్వారా ఈ మైలురాయిని చేరుకున్నాడు. 98 మ్యాచ్‌ల్లో 100 వికెట్లు సాధించిన అక్షర్, భారత్ తరఫున టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో నాలుగో స్థానానికి చేరాడు. అతని కంటే ముందున్నవారిలో అర్షదీప్ సింగ్ (134), జస్ప్రీత్ బుమ్రా (121), హార్దిక్ పాండ్యా (114) ఉన్నారు. ఈ ఘనతతో అక్షర్ భారత క్రికెట్ చరిత్రలో మరో ప్రత్యేక గుర్తింపు పొందాడు.

### బిష్ణోయ్ ఓవర్‌తో చేజారిన మ్యాచ్

**ఇంగ్లండ్‌కు నాలుగు వికెట్ల విజయం**

మాంచెస్టర్‌లో జరిగిన రెండో టీ20లో భారత్‌పై ఇంగ్లండ్ నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 10 ఆధిక్యం సాధించింది. 191 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ 19 ఓవర్లలోనే ఛేదించింది. జాకబ్ బెతెల్ 46 బంతుల్లో అజేయంగా 76 పరుగులు చేసి జట్టును గెలిపించాడు. భారత స్పిన్నర్ రవి బిష్ణోయ్ వేసిన 17వ ఓవర్‌లో 29 పరుగులు రావడం మ్యాచ్‌ను మలుపుతిప్పింది. రెండు నోబాల్స్‌తో పాటు మూడు భారీ సిక్సర్లు బాదిన బెతెల్ ఇంగ్లండ్ విజయాన్ని ఖాయం చేశాడు. అంతర్జాతీయ అరంగేట్రం చేసిన వైభవ్ సూర్యవంశీ 14 పరుగులు చేశాడు. భారత్ తరఫున అభిషేక్ శర్మ 43, ఇషాన్ కిషన్ 49 పరుగులు చేశారు.

### అరంగేట్రంలో అరుదైన చెత్త రికార్డు

**వైభవ్ సూర్యవంశీ పేరిట నమోదైన ఘట్టం**

ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టీ20లో భారత జట్టుకు అరంగేట్రం చేసిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఓ చెత్త రికార్డును తన పేరిట నమోదు చేసుకున్నాడు. టీ20 అంతర్జాతీయ తొలి మ్యాచ్‌లో స్టంపౌట్ అయిన భారత క్రికెటర్‌గా నిలిచాడు. విల్ జాక్స్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడేందుకు ప్రయత్నించిన వైభవ్ బంతిని మిస్ కావడంతో వికెట్ కీపర్ స్టంపౌట్ చేశాడు. 10 బంతుల్లో రెండు సిక్సర్లతో 14 పరుగులు చేశాడు. మరోవైపు 15 ఏళ్ల 99 రోజుల వయసులో భారత తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన అత్యంత పిన్న వయస్కుడిగా సచిన్ టెండూల్కర్ రికార్డును కూడా అధిగమించాడు.

# యుగానికి ఒక్కడు



యుగానికి ఒక్కడు వచ్చాడు... భారత క్రికెట్‌కు కొత్త సూర్యుడు ఉదయించాడు! 15 ఏళ్ల కుర్రాడి బ్యాట్ గర్జనతో 37 ఏళ్ల చరిత్ర ఒక్కసారిగా తలకిందులైంది. ప్రపంచం మొత్తం చూస్తుండగానే వైభవ్ సూర్యవంశీ అనే పేరు భారత క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడింది. మాంచెస్టర్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టీ20లో అరంగేట్రం చేసిన ఈ టీనేజ్ సంచలనం, కేవలం భారత జట్టులో చోటు దక్కించుకోవడమే కాదు... దాదాపు నాలుగు దశాబ్దాలుగా చెక్కుచెదరని సచిన్ టెండూల్కర్ రికార్డును కూడా ఛేదించాడు. తొలి మ్యాచ్‌లోనే రెండు భారీ సిక్సర్లతో తన భయమే తెలియని బ్యాటింగ్‌ను ప్రపంచానికి పరిచయం చేశాడు. ఇది ఒక ఆటగాడి అరంగేంట్రం మాత్రమే కాదు... భారత క్రికెట్‌లో కొత్త యుగానికి నాంది. భవిష్యత్ సూపర్ స్టార్‌గా ఇప్పటికే అభిమానుల గుండెల్లో స్థానం సంపాదించిన వైభవ్, ఒక్క మ్యాచ్‌తోనే కోట్లాది మంది ఆశలను తన భుజాలపై మోసే స్థాయికి చేరుకున్నాడు. భారత క్రికెట్‌కు కొత్త ఆశాకిరణం కాదు... కొత్త శకానికి శ్రీకారం చుట్టిన యువ సంచలనంగా వైభవ్ సూర్యవంశీ నిలిచిపోయాడు.

- సూరీడు వచ్చేశాడు!
- 15 ఏళ్లకే వైభవ్ చరిత్ర
- 37 ఏళ్ల రికార్డు కనుమరుగు..!
- ఇంగ్లండ్‌తో రెండో టీ20లో అరంగేట్రం

భారత్-ఇంగ్లండ్ మధ్య మాంచెస్టర్‌లో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌తో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టాడు. కోట్లాది మంది అభిమానులు ఆసక్తిగా ఎదురుచూసిన ఈ అరంగేట్రంలో వైభవ్ డెబ్యూ క్యాప్ అందుకుని భారత క్రికెట్ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాడు. కేవలం 15 ఏళ్ల 99 రోజుల వయసులో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి అత్యంత పిన్న వయస్కుడిగా అరంగేట్రం చేసిన ఆటగాడిగా నిలిచాడు.

### 37 ఏళ్ల సచిన్ రికార్డు బద్దలు

1989లో పాకిస్థాన్‌పై కరాచీలో జరిగిన మ్యాచ్‌లో 16 ఏళ్ల 205 రోజుల వయసులో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న 37 ఏళ్ల రికార్డును వైభవ్ సూర్యవంశీ చెరిపేశాడు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా చెక్కుచెదరని ఈ రికార్డును 15 ఏళ్లకే అధిగమించి భారత క్రికెట్‌లో కొత్త చరిత్ర సృష్టించాడు.

### డెబ్యూలోనే ధైర్యమైన బ్యాటింగ్

తొలి అంతర్జాతీయ మ్యాచ్‌లోనే వైభవ్ తన ప్రతిభను చాటాడు. కేవలం 10 బంతుల్లో 14 పరుగులు చేసి రెండు భారీ సిక్సర్లు బాదాడు. దూకుడుగా ఆడే ప్రయత్నంలో విల్ జాక్స్ బౌలింగ్‌లో స్టంపౌట్ అయినా, తన ఆత్మవిశ్వాసంతో అభిమానులను ఆకట్టుకున్నాడు. అతని ఇన్నింగ్స్ భారత జట్టుకు శుభారంభాన్ని అందించింది.

### జూనియర్ క్రికెట్ నుంచి అంతర్జాతీయ వేదిక వరకు

జూనియర్ స్థాయిలో వరుస శతకాలతో ఇప్పటికే అందరి దృష్టిని ఆకర్షించిన వైభవ్ సూర్యవంశీ, అదే జోరును అంతర్జాతీయ వేదికపై కూడా కొనసాగించే సంకేతాలు ఇచ్చాడు. ఈ మ్యాచ్‌కు ముందు తిలక్ వర్మ చేతుల మీదుగా డెబ్యూ క్యాప్ అందుకోవడం అతని కెరీర్‌లో మరో గుర్తుండిపోయే ఘట్టంగా నిలిచింది. సంజూ శాంసన్ స్థానంలో తుది జట్టులో అవకాశం దక్కించుకున్న వైభవ్ ఆ అవకాశాన్ని చరిత్రగా మలిచాడు.

### ప్రపంచ క్రికెట్‌లోనూ అరుదైన ఘనత

భారత్ తరఫున అత్యంత పిన్న వయసులో అరంగేట్రం చేసిన ఆటగాడిగా నిలిచిన వైభవ్, ప్రపంచ క్రికెట్‌లో కూడా అత్యంత చిన్న వయసులో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన మూడో ఆటగాడిగా గుర్తింపు పొందాడు. బంగ్లాదేశ్‌కు చెందిన మొహమ్మద్ షరీఫ్, పాకిస్థాన్ మాజీ ఆటగాడు ముష్తాక్ మొహమ్మద్ తర్వాత ఈ జాబితాలో వైభవ్ చోటు దక్కించుకున్నాడు. ప్రపంచ రికార్డు మాత్రం 14 ఏళ్ల 227 రోజుల వయసులో అరంగేట్రం చేసిన పాకిస్థాన్ క్రికెటర్ హసన్ రజా పేరిట కొనసాగుతోంది.

### భారత క్రికెట్‌కు కొత్త ఆశాకిరణం

వైభవ్ సూర్యవంశీ అరంగేట్రం భారత క్రికెట్‌కు మరో ప్రతిభావంతుడి ఆగమనంగా నిలిచింది. చిన్న వయసులోనే ఒత్తిడిని తట్టుకుని ధైర్యంగా ఆడిన తీరు అతని సామర్థ్యాన్ని చాటింది. భవిష్యత్తులో భారత జట్టుకు కీలక ఆటగాడిగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తొలి మ్యాచ్‌లోనే రికార్డు సృష్టించిన ఈ యువ ఆటగాడిపై ఇప్పుడు దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.


## శరవేగంగా ప్రభాస్
# స్పిరిట్ షూటింగ్




**నగర శివారులో జెట్ స్పీడ్‌తో చిత్రీకరణ**

రెబల్ స్టార్ ప్రభాస్, సెన్సేషనల్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్పిరిట' షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్ అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జెట్ స్పీడ్‌లో సాగుతుండగా.. చిత్ర బృందం ఎలాంటి విరామం లేకుండా వరుస షెడ్యూళ్లతో దూసుకెళుతోంది. స్పిరిట్ షూటింగ్‌లో ఇప్పటికే దాదాపు 70 శాతం పూర్తయినట్లు, కేవలం 30 శాతం చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా కోసం ప్రభాస్ కూడా పూర్తిస్థాయిలో సమయం కేటాయిస్తూ.. ప్రతి యాక్షన్ సన్నివేశాన్ని డూప్ లేకుండా స్వయంగా చేస్తున్నారని సమాచారం. యాక్షన్ సీక్వెన్సులలో ప్రభాస్ అంకిత భావం చిత్ర యనిట్‌ను కూడా ఆకట్టుకుంటోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక దర్శకుడు సందీప్ రెడ్డి వంగా పనితీరు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రీ 'ప్రొడక్షన్ దశలోనే ప్రతి సన్నివేశాన్ని, షూటింగ్ షెడ్యూల్‌ను పక్కాగా సిద్ధం చేసుకునే ఆయన.. సెట్స్‌పైకి వెళ్లిన తర్వాత మాత్రం శరవేగంగా చిత్రీకరణ పూర్తి చేసే దర్శకుడిగా పేరొందాడు. 'స్పిరిట' విషయంలోనూ అదే వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముందస్తు ప్రణాళిక కారణంగానే షూటింగ్ ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా కొనసాగుతోందని సమాచారం.

## నెట్‌ఫ్లిక్స్‌లో ఫిక్స్ అయిన పెద్ది




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన 'పెద్ది' మవీ ఓటిటి రిలీజ్ డేట్ కన్ఫామ్ అయ్యింది.థియేటర్లలో సూపర్ హిట్‌గా నిలిచిన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. 'ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ తేదీని అధికారికంగా ప్రకటించింది. జూలై 9 నుంచి ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి రానుంది. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో కూడా ఒకేసారి విడుదల చేయనున్నట్లు నెట్‌ఫ్లిక్స్ వెల్లడించింది. దీంతో థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు ఇంట్లోనే ఈ చిత్రాన్ని ఆస్వాదించే అవకాశం దక్కనుంది. విడుదలైన తొలి రోజు నుంచే 'పెద్ది'కి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. గ్రావిణ నేపథ్యంలో స్పోర్ట్స్, ఎమోషన్, ఫ్యామిలీ డ్రామా అంశాలను సమతుల్యంగా మిళితం చేసిన బుచ్చిబాబు కథనం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా రామ్ చరణ్ నటన, పాత్రలోని తీవ్రత, భావోద్వేగ సన్నివేశాలు సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. ప్రపంచవ్యాప్తంగా రూ.400 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించి ఈ చిత్రం రామ్ చరణ్ కెరీర్‌లో మరో భారీ విజయంగా నిలిచింది.

## 10న విడుదలవుతున్న లెనిన్



- నేడు తిరుపతిలో ప్రీ రిలీజ్ ఈవెంట్

అక్కినేని అఖిల్ హీరోగా, అందాల తార భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించిన చిత్రం 'లెనిన'. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూలై 10న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. అఖిల్ కెరీర్‌లో ఎంతో కీలకంగా భావిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలలో మరింత వేగవంతం చేసింది. ఇప్పటికే విడుదలైన 'లెనిన' ట్రైలర్ కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా యాక్షన్, ఎమోషన్స్, నాగార్జున వాయిస్ ఓవర్‌తో రూపొందిన ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచింది. తాజాగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ తేదీ, వేదికను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. జూలై 5న తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్స్‌లో లెనిన్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను చిత్ర యనిట్ ఘనంగా నిర్వహించనుంది. ఈ ఈవెంట్‌కు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే ప్రారంభమైనట్లు తెలుస్తోంది.

## రాజమౌళికి అరుదైన గౌరవం



- వాల్ ఆఫ్ ఫిల్మ్ మేకర్స్'లో చోటు

తెలుగు సినిమా గ్లోబల్ స్థాయికి వెళ్ళిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళికి ఫ్రాన్స్ లో మరొక అరుదైన గౌరవం దక్కింది. ఫ్రాన్స్ లోని లూమియర్ ఇన్స్టిట్యూట్, దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళిని ప్రత్యేకంగా సత్కరించింది. అక్కడి 'వాల్ ఆఫ్ ఫిల్మ్ మేకర్స్' పై ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ దర్శకుల పేర్లు ఉన్నాయి. ఇప్పుడు రాజమౌళి పేరు కూడా ఆ జాబితాలో చేరింది. ఈ ప్రోగ్రామ్ లో రాజమౌళి తెరకెక్కించిన 'ఈగ', 'ఆరఆరఆర' సినిమాలను ప్రదర్శించారు. 2012 లో విడుదలైన 'ఈగ', చిన్న కాన్సెప్ట్ ను కొత్తగా చూపించిన సినిమాగా గుర్తింపు పొందింది. ఇక 'ఆరఆరఆర' ప్రపంచవ్యాప్తంగా విడుదలై పలు అంతర్జాతీయ అవార్డులు అందుకోవడంతో పాటు, భారతీయ సినిమాపై విదేశీ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఇటీవలే పారిస్ లోని 'సినీమాథెక్ ఫ్రాంకైస' థియేటర్ లో రాజమౌళి పేరుతో శాశ్వత సీటును కేటాయించగా, ఇప్పుడు లూమియర్ ఇన్స్టిట్యూట్ జక్కన్న చిత్రాలతో ప్రత్యేక రెట్రోస్పెక్టివ్ ను నిర్వహిస్తుంది. 'బాహుబలి', 'ఈగ', 'ఆరఆరఆర' లాంటి చిత్రాలను ప్రదర్శిస్తూ, భారతీయ సినిమాలపై అంతర్జాతీయ ప్రేక్షకుల్లో ఆసక్తి ఎలా పెరుగుతోందో మరోసారి చూపిస్తుంది.



## నా లైఫ్ పార్ట్‌నర్ సెన్సిబుల్‌గా ఉండాలి: నటి శ్రీలీల

టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ అండ్ ఎనర్జిటిక్ బ్యూటీ శ్రీలీల పెళ్లి, రిలేషన్‌షిప్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న బ్యూటీ.. తనకు కాబోయే వాడు ఎలా ఉండాలి? తన లైఫ్ పార్ట్‌నర్‌లో ఎలాంటి క్వాలిటీస్ వెతుకుతుంది? అనే విషయాలపై తాజాగా క్లారిటీ ఇచ్చింది. ఒక ఇంటర్వ్యూలో శ్రీలీలను రిలేషన్‌షిప్ గురించి అడగగా, తన మనసులోని మాటను పంచుకుంది. తనకు కాబోయే వాడు ముఖ్యంగా మదు లక్షణాలు కలిగి ఉండాలని స్పష్టం చేసింది. 'నాకు లైఫ్ పార్ట్‌నర్‌గా వచ్చే వ్యక్తి చాలా సెన్సిబుల్‌గా ఉండాలి. అలాగే ఇతరుల భావాలను గౌరవించే సెన్సిటివ్ మనస్తత్వం ఉండాలి. వీటన్నింటితో పాటు మోస్ట్ ఇంపా`ట్గంట్ క్వాలిటీ.. అతనికి మంచి సెన్స్ ఆఫ్ హ్యూమర్ కచ్చితంగా ఉండాలి' అని శ్రీలీల పేర్కొంది. కేవలం లుక్స్ మాత్రమే కాకుండా, వ్యక్తిత్వానికి, ఎదుటివారిని అర్థం చేసుకునే గుణానికే తాను మొదటి ప్రాధాన్యత ఇస్తానని ఈ బ్యూటీ హింట్ ఇచ్చేసింది. ప్రస్తుతం శ్రీలీల చేసిన ఈ కామెంట్స్ సోషల్ విడియాలో వైరల్ అవుతున్నాయి. గ్లామర్, యాక్టింగ్, అదిరిపోయే డాన్స్‌లతో కుర్రకారు మనసు దోచుకున్న ఈ ముద్దుగుమ్మ.. రిలేషన్‌షిప్ విషయంలో ఇంత క్లారిటీగా ఉండటంపై ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. శ్రీలీల చెప్పిన క్వాలిటీస్ విన్నాక.. 'బాస్.. ఆ క్వాలిటీస్ మనలో ఉన్నాయో లేదో ఒకసారి చెక్ చేసుకోవాల్సిందే' అంటూ నెటిజన్లు, అబ్బాయిలు సోషల్ విడియాలో సరదా కామెంట్స్ పెడుతున్నారు.

This newspaper is Owned and Published by KANTIPUDI RAVENDRA from **H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072.** Editor: KANTIPUDI RAVENDRA, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com.
Corporate Office: HIG 79, VNR RESIDANCY ,VENKATARAMANA COLONY, KUKATPALLY ,HYDERABAD, 500085